


ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వేతనం.. ఏదీ గౌరవం?

పల్లెల్లో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోంది. ఆ ప్రక్రియలో ప్రధానమైన రిజర్వేషన్లకు సంబంధించి ఇటీవల విడుదల చేసిన జీవోలో సైతం 2024లో చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులసర్వే ఆధారంగా వార్డులకు సంబంధించి రిజర్వేషన్లు చేయాలని సూచించింది. దానికి తగ్గట్టుగానే అధికారులు కూడా రిజర్వేషన్లు పూర్తిచేసి పంచాయతీ ఎన్నికల నిర్వహణ కొనసాగుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ అసలు 2024లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో కీలకపాత్ర పోషించిన వారికి మాత్రం నేటివరకు గౌరవంగా దక్కాల్సిన వేతనం మాత్రం అందలేదు. కాగా ప్రస్తుతం పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో వారికి రావాల్సిన నగదుపై చర్చ సాగుతోంది.



- నేటికీ విడుదల కాని సమగ్ర సర్వే డబ్బులు
- ఏడాది కాలంగా ఎదురు చూస్తున్న సిబ్బంది
- అధికారుల చుట్టూ తిరిగి.. అలసిన వైనం
- ఉమ్మడి జిల్లాలో రూ.6కోట్లకు పైనే బకాయి
- గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో సర్వే సిబ్బందిలో చర్చనీయాంశం

కొత్తగూడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి)

గతేడాది నవంబరు 6న రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన సర్వేను చేపట్టింది. ప్రతీ వాడ, వీధి, ఇల్లు తిరిగి వివరాలు సేకరించింది. సుమారు 75 ప్రశ్నలకు సంబంధించి వివరాలను సేకరించి వాటిని ఆన్‌లైన్ కూడా చేయించింది. ఈ ప్రక్రియ మొత్తం చేసేందుకుగాను అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతోపాటుగా, పలువురు ఉద్యోగులను ఉపయోగించారు. వారిలో కొందరిని ఎన్యుమరేటర్లుగా, మరికొందరిని సూపర్‌వైజర్లుగా నియమించుకుంది. ఎన్యుమరేటర్లకు రూ. 10వేలు, సూపర్‌వైజర్లకు రూ.12వేలు గౌరవవేతనంగా నిర్ణయించింది. సర్వేలో భాగంగా ఒక్కో కుటుంబానికి సంబంధించి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసినందుకుగాను రూ.30 చొప్పున ఇస్తామని కూడా చెప్పుకొచ్చారు. అలా డిసెంబరు,2024 రెండోవారం వరకు సర్వే నిర్వహించి ప్రక్రియను పూర్తిచేశారు. ఇది గడిచి ఏడాది పూర్తి కాగా.. నేటికీ వారికి గౌరవ వేతనం కింద అందించాల్సిన నగదును మాత్రం అందించని పరిస్థితి నెలకొంది. కాగా దానిపై ఆశలు పెట్టుకున్న కొందరు అధికారులు చుట్టూ తిరిగి విసిగి వేశారిన దుస్థితి నెలకొంది. అలా నెలలు తరబడి తిరిగిన సమగ్ర సర్వేలో పాల్గొన్న సిబ్బందిలో కొందరు చివరకు వచ్చిన రోజు తీసుకోవచ్చు అనే స్థాయికి చేరుకోగా.. మరికొందరు మాత్రం ఇప్పటికీ తమ పైసలు ఎప్పుడొస్తాయంటూ అధికారులను అడుగుతూనే ఉన్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో తాము కష్టపడి సర్వే చేసి సేకరించిన డేటాను ఉపయోగించుకున్నారు కానీ... తమను మాత్రం పక్కన పెట్టేశారంటూ కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో రూ.6 కోట్లకు పైగానే బకాయి..

సమగ్ర కుటుంబ సర్వే సమయంలో సిబ్బంది సరిపోని పక్షంలో బయట నుంచి సిబ్బందిని కూడా నియమించుకున్నారు. వారిలో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థుల నుంచి, చదువుకున్న యువతీ యువకులు బోలెడుమంది ఉన్నారు. ఖమ్మం జిల్లాలో కార్పోరేషన్, మున్సిపాలిటీ వంటి ప్రాంతాల్లో వీరిసంఖ్య ఎక్కువగా ఉంది. అలా సర్వేలో ఖమ్మం జిల్లాకు సంబంధించి 3,654 ఎన్యుమరేట్ల బ్లాకులను గుర్తించి వారితో 4.71 లక్షల కుటుంబాలను సర్వే చేయించారు. కొత్తగూడెం జిల్లాకు సంబంధించి 2,460 బ్లాకులుగా విభజించి 3.36 లక్షల కుటుంబాల సర్వే పూర్తి చేయించారు. సర్వే పూర్తయిన అనంతరం ప్రతీ మండలానికి సుమారు 20 మంది ఆపరేటర్లు ద్వారా ఆన్‌లైన్ ప్రక్రియను సైతం పూర్తి చేశారు. అలా ఉమ్మడి జిల్లాకు సంబంధించి సుమారు రూ. 6కోట్ల వరకు ప్రభుత్వం నుంచి సర్వేలో పాల్గొన్న సిబ్బందికి అందాల్సి ఉంది. అయితే సదరు వేతనాలకు సంబంధించి నగదు ఎప్పుడు వస్తాయో జిల్లా స్థాయి అధికారులకు సైతం తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవల కాలంలో సర్వేలో పాల్గొన్న సిబ్బందికి సంబంధికి సంబంధించి సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్ల వారీగా బ్యాంకు ఖాతాల వివరాలు సేకరించి హైదరాబాద్‌కు పంపించినట్టు కొందరు అధికారులు చెబుతున్నారు. సదరు గౌరవ వేతనం నేరుగా వారి అకౌంట్లలోనే జమవుతోందని చెబుతున్న అధికారులు.. అవి వారి అకౌంట్లలో ఎప్పుడు జమవుతుందో మాత్రం చెప్పలేని పరిస్థితి నెలకొంది.

కొత్తగూడెం పాల్గొన్న ఎన్యుమరేటర్ల వివరాలు

కొత్తగూడెం మున్సిపాలిటీలో 182, మణుగూరు మున్సిపాలిటీ 60, ఇల్లెందు 98, పాల్వంచ మున్సిపాలిటీ 185, ఆళ్లపల్లి 30, అన్నపురెడ్డిపల్లి 49, అశ్వారావుపేట 120, చర్ల 104, చంద్రుగొండ 70, చుంచుపల్లి 93, దమ్మపేట 120, గుండాల 39, జూలూరుపాడు 76, సుజాతనగర్ 68, లక్ష్మీదేవిపల్లి 93, ముల్కలపల్లి 102, పాల్వంచ 86, టేకులపల్లి 122, ఇల్లెందు 146, అశ్వాపురం 96, భద్రాచలం 83, బూర్గంపాడు 120, దుమ్ముగూడెం 106, మణుగూరు 101, పినపాక 70, కరకగూడెం 41 మంది సిబ్బంది పాల్గొన్నారు.

ఏకగ్రీవాల్లో కాంగ్రెస్‌దే హవా

- జిల్లాలో తొలి విడతలో 20పంచాయతీల్లో 19 కైవసం, ఒకటి సీపీఐకి..
- రెండో విడతలో కాంగ్రెస్ 4, మాస్‌లైన్‌కు ఒకటి..

■ ఖమ్మం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవ పంచాయతీల్లో కాంగ్రెస్ హవా చూపుతోంది. గతసారి బీఆర్ఎస్ హవా చూపించగా మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మెరుగైన ఫలితాలను సాధిస్తుంది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి నియోజకవర్గాల్లో కొన్ని పంచాయతీలు ఏకగ్రీవాలు అవుతున్నాయి. కొన్నిచోట్ల పోటాపోటీగా నామినేషన్లు వేయడంతో ఈసారి పంచాయతీ ఎన్నికలు రసకందాయంగా మారబోతున్నాయి. ఖమ్మం జిల్లాలో మొత్తం 20పంచాయతీలు ఏకగ్రీవం కాగా 19 పంచాయతీలను కాంగ్రెస్, సీపీఐ ఒక పంచాయతీని దక్కించుకుంది. జిల్లాలో ఉప ముఖ్యమంత్రి మలు భట్టి విక్రమార్క స్వగ్రామమైన వైరా మండ లంలోని స్నానాల లక్ష్మీపురం పంచాయతీని కాంగ్రెస్ గెలిచింది. కా గా.. మధిర నియోజకవర్గంలో ఆరు పంచాయతీలు ఏకగ్రీవమ య్యాయి. ఖమ్మం నియోజకవర్గంలో ఐదు పంచాయతీలు ఏకగ్రీవ మయ్యాయి. రఘునాథపాలెం గాజుల కృష్ణారావు, రాములుతండా బానోత్ వెంకటరావు, రేగులచలక యండపల్లి రమాదేవి, మంగ్యా తండా మాలోతు భార్గవి, మల్లేపల్లి తేజావత్ బద్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎర్రుపాలెం మండలంలో మెత్తం 30 పంచాయతీలకు గాను 6 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఈపంచాయతీలను కాంగ్రెస్ గెలుచుకుంది. జమలాపురం తుళ్లూరు నిర్మలకుమారి, కాచవరం షేక్ ఫాతిమా, గట్లగౌరారం బండ్ల రాణి, రామన్నపాలెం వేమిరెడ్డి పరమేశ్వరి, కంద్రిక భూక్యా రాము, చొప్పక ట్లపాలెంలో బొగ్గుల శ్రీనివాసరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మధిర మండలంలో 27పంచాయతీలకు గాను రెండుపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. సిద్దినేనిగూడెం (మర్లపాడు) సర్పంచ్‌గా వేల్పుల వెంకట రావమ్మ, సైదెల్లిపురం సర్పంచ్‌గా నెల్లూరి ధనలక్ష్మి ఎన్నికయ్యారు. రఘునాథపాలెం మండలంలో మొత్తం 31పంచాతీయలకు గాను ఐదు ఏకగ్రీవం కాగా.. అవి కాంగ్రెస్ దక్కించుకుంది. చింతకాని మండలంలో 26పంచాయతీలకు గాను రెండు ఏకగ్రీవ మయ్యాయి. వీటిలో రేపల్లెవాడ సర్పంచ్‌గా కాంగ్రెస్‌కు చెందిన మడిపల్లి అంబిక, రాఘవాపురం సర్పంచ్‌గా సీపీఐకి చెందిన కాంప ల్లి కోటమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బోనకల్ మండలంలో మొ త్తం 22 పంచాయతీలకు గాను ఒకటి ఏకగ్రీవమైంది. కలకోట పంచాయతీని కాంగ్రెస్ దక్కించుకోగా సర్పంచ్‌గా పైడిపల్లి అనిత ఎన్నికయ్యారు. వైరా మండలంలో నాలుగు పంచాయతీలు ఏకగ్రీవమవగా.. అవి కాంగ్రెస్ ఖాతాలో చేరాయి. అందులో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వగ్రామం స్నానాల లక్ష్మీపురం పంచాయతీ సర్ప ంచ్‌గా నూతి వెంకటేశ్వరరావు, నారపునేనిపల్లి శీలం చంద్రశేఖర రెడ్డి, గోవిందాపురం రంగిశెట్టి కళావతి, పుణ్యపురం వెంగల మరి యమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వగ్రామం స్నానాల లక్ష్మీపురంలో ఏకగ్రీవ సర్పంచ్, వార్డు సభ్యులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఖమ్మం డీసీసీ చీఫ్ నూతి

రెండో విడతలో ఇలా..

రెండో విడతలో కూడా జిల్లాలో నామినేషన్ల

(మిగతా 6లో)

ఎస్టీ ఓటర్లు లేక.. మిగిలినవారు వేయక..

- ఎన్నికలకు దూరమైన పాండురంగాపురం
- భద్రాద్రి జిల్లాలో రెండు విడతల్లో 15 పంచాయతీలు ఏకగ్రీవం

6

ముమ్మరంగా పంచాయతీ

ఎన్నికల ప్రక్రియ

తేలిన తొలివిడత అభ్యర్థుల లెక్క

- గుర్తుల కేటాయింపు పూర్తి
- రెండోవిడతలో సర్పంచ్‌లకు 1,055, వార్డులకు 4,160 నామపత్రాల దాఖలు
- తుదివిడతకు ప్రక్రియ ప్రారంభం

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఈ క్రమంలో తొలివిడత ఏడు మండలాలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ బుధవారం ముగియడంతో బరిలో నిలిచిన అభ్యర్థుల లెక్కతేలింది. బుధవారం మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ పూర్తవగా.. 19 పంచాయతీల్లో సర్పంచ్, 220 వార్డులకు ఒకే ఒక నామినేషన్ చొప్పున దాఖలు కావడంతో రిటర్నింగ్ అధికారులు వాటిని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఇక ఈ తొలివిడతలో 173 పంచాయతీలకు, 1,520 వార్డులకు ఎన్నికలు జరగనుండగా ఆ అభ్యర్థుల జాబితాను ప్రకటించిన రిటర్నింగ్ అధికారులు గుర్తులను కేటాయించారు. దీంతో నేటి నుంచి తొలివిడత అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోనున్నారు. డిసెంబరు 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను వెల్లడించనున్నారు. అయితే బరిలో నిలిచిన అభ్యర్థుల లెక్కను గురువారం వెల్లడించనున్నారు.

రెండోవిడత నామినేషన్ల పరిశీలన పూర్తి

రెండో విడత ఎన్నికలు జరిగే 6 మండలాల్లో 183 పంచాయతీలకు, 1686 వార్డలకు నామినేషన్ల స్వీక రణ ప్రక్రియ గత నెల 30న ప్రారంభమై మంగళవారం పూర్తయింది. ఈ క్రమంలో సర్పంచ్ స్థానాలకు 1,055 నామినేషన్లు, వార్డులకు 4.160 నామినేషన్లు అందాయి. ఈ నామినేషన్ల పరిశీలన ప్రక్రియను బుధవారం పూర్తిచేశారు. వీటికి గురువారం అప్పీళ్లను స్వీకరించి.. 5న పరిష్కరిస్తారు. ఆరోతేదీ మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు కాగా.. తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటించి.. వారికి గుర్తులు కేటాయిస్తారు. డిసెంబర్ 14న పోలింగ్.. అదే రోజు ఓట్ల లెక్కింపు ఫలితాల వెల్లడి ఉంటుంది. అయితే రిటర్నింగ్ అధికారులకు పలు పంచాయతీలను విడివిడిగా కేటాయించడంతో నామినేషన్ల లెక్కలు గడువులోగా గణాంకాలు అందించడంలో విఫలమవుతున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత వివరాలు వెల్లడిస్తుండడంతో అంతా అయోమయంగా ఉంటోంది. ఇక మూడో విడత ఎన్నికలు జరిగే 184 పంచాయతీలు, 1,858 వార్డులకు నామినేషన్ల స్వీకరణ బుధవారం ప్రారంభమైంది. శుక్రవారం స్వీకరణ గడువు పూర్తి కానుండగా.. తొలిరోజు నామినేషన్ల కార్యక్రమం రాత్రి వరకూ కొనసాగుతూనే ఉంది.



డివైడర్‌ను ఢీకొన్న కారు.. ముగ్గురి మృతి

- మృతుల్లో ఇద్దరు యువకులు.. ఓ మైనర్
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- కుటుంబాలకు మంత్రి తుమ్మల సంతాపం, ఎమ్మెల్యే రాగమయి పరామర్శ

7

మెడికల్ కళాశాలలో స్వాగత వేడుకలు

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బుధవారం రాత్రి ఫ్రెషర్స్‌డే ఘనంగా జరిగింది. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, డిప్యూటీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు, అధ్యాపకులు డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్, బి కిరణ్‌కుమార్, సరిత తదితరులు జ్యోతిప్రజ్వలన చేసి స్వాగత వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు రెండు, మూడో ఏడాది విద్యార్థులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో సందడి చేశారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు



ఎన్నడు.. మారేనో?

- చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోయిన పాత ఎన్టీఆర్ కాల్వ
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

6

స్వేచ్ఛాయుత ఎన్నికలే

లక్ష్యంగా పనిచేయాలి



- పకడ్బందీగా విధులు నిర్వర్తించాలి
- పోలీసు సిబ్బందికి సీపీ సునీల్‌దత్ సూచనలు

7

వస్త్రాల నిర్వహణ.. ఇకపై దేవస్థానానిదే!

- ఆలయ అధికారుల పరిశీలనలో ప్రతిపాదన
- ఇంతకాలం లెక్కల్లో భారీ తేడాలు!
- బార్‌కోడింగ్‌తో వెలుగులోకి వాస్తవాలు
- వస్త్రాల కాంట్రాక్టర్‌కు తుది నోటీసు జారీ చేసిన అధికారులు

భద్రాచలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి రామయ్యకు భక్తులు సమర్పించిన వస్త్రాలను తిరిగి భక్తులకు విక్రయించే కేంద్రం నిర్వహణ బాధ్యతను ఇకపై దేవస్థానమే చేపట్టనుందనే ప్రచారం ఆలయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. వస్త్రాల కౌంటర్ల నిర్వహణపై తొలి నుంచి వస్తున్న విమర్శలు, ఆరోపణలు, ఇటీవల పట్టుబడ్డ బయటి వస్త్రాల ఉదంతాలను దృష్టిలో ఉంచుకొని దేవస్థానం అధికారులు స్వయంగా దేవస్థానమే వస్త్రాల నిర్వహణ చేపడితే ఎలా ఉంటుంది !? అన్న ఆలోచన తెరపైకి వచ్చింది. దీంతో ఆ ప్రతిపాదనను నూతన సంవత్సరంలో అమలు చేసే దిశగా యోచిస్తున్నట్లు దేవస్థానం అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఫలితంగా తరచూ అవకతవకల ఆరోపణలకు చెక్ పెట్టే అవకాశం ఉంటుందని దేవస్థానం అధికారులు భావిస్తున్నారు.

లెక్కల్లో వ్యత్యాసాలు

సుమారు దశాబ్దకాలం క్రితం భక్తులు స్వామి వారికి సమర్పించిన వస్త్రాలను దేవస్థానం తరఫున భక్తులకు విక్రయించేందుకు టెండర్లను ఆహ్వానించింది. ఈ టెండర్లను చేజిక్కించుకున్న నిర్వాహకులు అనేక అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలు తరచూ వెలువడ్డాయి. గతంలో సైతం వస్త్రాలను బయట నుంచి తీసుకొచ్చి విక్రయించారనే ప్రచారం ఉంది. అయితే దేవస్థానం ఏడాది క్రితం బార్‌కోడింగ్ విధానాన్ని ప్రవేశపెట్టడంతో ఇది సత్ఫలితాలను ఇస్తోందని చెప్పక తప్పదని దేవస్థానం వర్గాలే అంగీకరిస్తున్నాయి. వస్త్రాల విక్రయ కేంద్రం నిర్వాహకులు ఇప్పటి వరకు ఎన్ని వస్త్రాలు విక్రయించారు!? దాని ద్వారా వాటికి ఎంత మొత్తం ఇప్పటి వరకు చేతికి అందింది!? వంటి అంశాలను సైతం బార్‌కోడింగ్ ద్వారా తెలుసుకునే వెసులుబాటు ఏర్పడిందని తెలుస్తోంది. బార్‌కోడింగ్ ప్రక్రియ చేపట్టడంతో బయట నుంచి వస్త్రాలు వస్తే గుర్తించడం అత్యంత సులభతరంగా మారుతోంది. ఇందుకు ఇటీవల వారం రోజుల్లో రెండుసార్లు దేవస్థానం అధికారులు సమర్పణ కేంద్రంతో పాటు విక్రయ కేంద్రంలో బయటి వస్త్రాలను గుర్తించారు. తాజాగా రెండు రోజుల క్రితం 17 వస్త్రాలను బయట నుంచి తీసుకొచ్చి విక్రయించేందుకు కౌంటర్లో సిద్ధంగా ఉంచగా, పట్టుకున్నట్లు వినికిడి. కాగా.. వస్త్రాల విక్రయశాలలో బార్‌కోడింగ్ స్లిప్‌ను మారుస్తూ 120కి పైగా వస్త్రాలను విక్రయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వస్త్రాల కాంట్రాక్టర్‌కు తుది నోటీసు జారీ

దేవస్థానంలో స్వామి వారి వస్త్రాలను విక్రయించే కాంట్రాక్టర్‌కు తుది నోటీసును దేవస్థానం అధికారులు జారీ చేశారు. బయటి వస్త్రాలను విక్రయించేందుకు ప్రయత్నించడంతో పాటు కేంద్రం నిర్వహణలో లెక్కల నిర్వహణ సరిగ్గా లేదనే ఆరోపణలతో అధికారులు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. దాని ఆధారంగా భక్తుల మనోభావాలను

(మిగతా 6లో)



దేవస్థానంలోని వస్త్రాల విక్రయ కేంద్రం



కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో నాటు బాంబు పేలి శునకం మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీసులు

రైల్వే స్టేషన్‌లో నాటు బాంబు!

- బాంబును కొరికి మృతి చెందిన వీధికుక్క
- కొత్తగూడెంలో కలకలం
- అడవి జంతువుల వేట కోసం తయారు చేసిన నాటుబాంబులని ప్రాథమిక నిర్ధారణ
- తనిఖీలు నిర్వహించిన బాంబ్‌స్క్వాడ్ బృందం
- నిర్వీర్యం చేయడంతో ఊపిరి పీల్చుకున్న జనం

6

కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించాలి

» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పార్టీ నాయకులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కలిసికట్టుగా పనిచేసి.. పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్ వెళ్లే క్రమంలో కూసుమంచిలోని క్యాంపు కార్యాలయం వద్ద కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులు, కాంగ్రెస్ నాయకులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా పొంగులేటి వారికి పలుసూచనలు చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీకి పునాదిలాంటివని, ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపునకు సైనికుల్లా పనిచేయాలని తెలిపారు. ఎక్కువశాతం ఏకగ్రీవమయ్యేలా చూడాలని, రెబల్ అభ్యర్థులకు భవిష్యత్‌లో ఏదో ఒక అవకాశం ఇస్తామని చెప్పి బుజ్జగించాలని సూచించారు. వారి త్యాగాలను పార్టీ మర్చిపోవొద్దని అన్నారు. పార్టీకోసం పనిచేసిన ప్రతీ ఒక్కరికి భవిష్యత్‌లో మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమపథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేసి అభ్యర్థుల విజయానికి కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో కూసుమంచి పంచాయతీ అభ్యర్థి కొండా కృష్ణవేణి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగు ప్రోత్సాహానికి తీసుకున్న చర్యలేంటి?

» లోక్ సభలో వివరాలు కోరిన ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి



ప్రసంగిస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి

ఖమ్మం అర్బన్ డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ సాగును ప్రోత్సహించే విధంగా కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వివరించాలని ఖమ్మం పార్లమెంటు సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి బుధవారం లోక్‌సభలో ప్రశ్నించారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా ఆయన పార్లమెంటులో ఈ అంశాన్ని ప్రస్తావించారు. రైతులు రసాయన మందుల వాడకాన్ని తగ్గించేందుకు వీలుగా రాష్ట్రాల్లో బయో ఇన్ పుట్ రీసెర్చ్ సెంటర్లు (బీఆర్‌సీ)ల ఏర్పాటు వివరాలను తెలియజేయాలన్నారు. కాగా ఈవిషయం పై కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖల సహాయ మంత్రి రామ్ నాథ్ ఠాకూర్ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా పదివేల బీఆర్సీలను ఏర్పాటు చేసేందుకు నేషనల్ మిషన్ ఆఫ్ నేచురల్ ఫార్మింగ్ సిద్ధంగా ఉందని, ఇప్పటివరకు రాష్ట్రాల్లో 3,517 బీఆర్సీలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆమేరకు తెలంగాణ రాష్ట్రంలో 250, ఖమ్మం జిల్లాలో 6 బీఆర్సీలను గుర్తించినట్లు పేర్కొన్నారు. బీజామృత్, జీవామృత్, నీమాస్త్ర, దశపర్ని తదితర సేంద్రియ ఎరువులను రైతులకు అందిస్తున్నామన్నారు. పంటల్లో తెగుళ్ల నివారణకు రసాయన ఎరువుల స్థానంలో సేంద్రియ ఎరువులను ప్రోత్సహిస్తున్నామన్నారు. క్లస్టర్‌స్థాయి సంస్థగా రైతులకు ప్రత్యేక శిక్షణ ప్రదర్శనలు ఉంటాయని, సొసైటీలు, రైతు ఉత్పత్తిసంస్థలు, స్వయం సహాయక బృందాలతో ఈ బీఆర్సీలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ఫ్రాడ్ కాల్ ఫుల్ స్టాఫ్‌తో సైబర్ నేరాల నియంత్రణ సాధ్యం: ఎస్పీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు, అధికారులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఫ్రాడ్ కాల్ ఫుల్ స్టాఫ్‌తో సైబర్ నేరాల నియంత్రణ సాధ్యపడుతుందని భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో ప్రజలు సైబర్ నేరాల భారీన పడకుండా చేయడమే పోలీసుల ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఫ్రాడ్ కాల్ ఫుల్ స్టాఫ్ పోస్టర్స్ ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజల్లో సైబర్ నేరాల నివారణపై అవగాహన పెంచేందుకు జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు, పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో ఫ్రాడ్ కాల్ ఫుల్ స్టాఫ్ పేరుతో 42 రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ అశోక్, సీఐ జితేందర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్, శ్రీనివాస్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ రాము, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఎస్ఐలు రజామౌళి, శ్రీను పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించాలి : డీఎస్పీ అశోక్

విద్యార్థి దశలోనే సైబర్ క్రైమ్‌లపై అవగాహన విద్యార్థులకు కల్పించాలని సైబర్ క్రైమ్ సెక్యూరిటీ డీఎస్పీ అశోక్ బుధవారం వెల్లడించారు. మండలంలోని ఎస్ఆర్. ప్రైమ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. మొబైల్‌కు వచ్చే రాంగ్ కాల్స్, రాంగ్ మెసేజ్‌లకు ఎవరు స్పందించకూడదన్నారు. సోషల్ మీడియా వేదికగా సైబర్ నేరగాళ్లు ఈ నేరాలకు పాల్పడుతున్నారని సూచించారు. తమ ఇండ్లలోని వాడుతున్న మొబైల్‌కు వచ్చే ఎటువంటి లింక్స్ ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు ఎవరికి తెలియజేయదని సూచించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ జితేందర్, కొత్తగూడెం టూటౌన్ సీఐ ప్రతాప్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు బాలికల అప్పగింత

ఖమ్మం క్రైం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): స్కూల్ నుంచి అదృశ్యమైన ముగ్గురు బాలికలను బుధవారం ఖమ్మం వన్‌టౌన్ పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. సరదాగా హైదరాబాద్ వెళ్లాలని ఉద్దేశ్యంతో ముగ్గురు బాలికలు మంగళవారం మధ్యాహ్నం కృష్ణా రైలు ఎక్కి వెళ్లిపోయారు. వరంగల్ దాటిన తరువాత వచ్చే స్టేషన్ తరువాత రైలు ఆగిపోతుందని, ఇది కాజీపేట వరకే వెళుతుందని పక్కన ఉన్న ప్రయాణికులు అనుకుంటుండగా అది విని ముగ్గురు కాజీపేట రైల్వేస్టేషన్‌లో దిగారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చిన తరువాత అక్కడ ఓపూలదండల కొట్టు వద్ద ఆగి మాట్లాడుకుంటుండగా ఆషాపు యజమాని షరీఫ్ అనే వ్యక్తి వారితో ఎక్కడికి వెళ్లాలని మాట్లాడాడు. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చామని తెలపడంతో కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్స్ తెలుసుకుని సమాచారం అందించాడు. అయితే కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మం వన్ టౌన్ సీఐ కరుణాకర్‌కు సమాచారం ఇవ్వడంతో వెంటనే అక్కడి రైల్వే పోలీసులకు, సమీప స్టేషన్ పోలీసులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసులు వారి వద్దకు వెళ్లి స్టేషన్ వద్దకు తీసుకు వెళ్లారు. అప్పటికే సీఐ కరుణార్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విజయవాడ, హైదరాబాద్ వైపు సిబ్బందిని పంపగా వారు అక్కడి చేరుకొని బాలికలను ఖమ్మానికి తీసుకువచ్చారు. అనంతరం వారిని వచ్చిన బాలికలను కుటుంబ సభ్యులకు సీఐ అప్పగించారు. కాగా బాలికలలో ఒకరి తండ్రి ఆటో డ్రైవర్ కావడంతో తండ్రి ఇంట్లో మాట్లాడుతున్న సమయంలో 3గంటలకు కృష్ణా రైలు ఉంటుందని ఆసమయంలో ప్రయాణికులు ఎక్కువగా ఉంటారని అన్న విషయం విని ఆ సమయంలోనే బాలికలు వెళ్లినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

పత్తి రైతుల కష్టాలు

» జూలూరుపాడులో తెల్ల బంగారం కొనుగోళ్ల నిలిపివేత...

» రహదారిపై బారులు తీరిన వాహనాలు

» తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు వ్యాపారుల ప్రయత్నం

» విక్రయించకుండా నిరాశతో వెనుతిరిగిన రైతులు



జూలూరుపాడులో రహదారిపై నిలిచిన పత్తి వాహనాలు

జూలూరుపాడు, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల నుంచి రైతులు పత్తిని విక్రయించేందుకు వాహనాలలో జూ లూరుపాడుకు తీసుకువచ్చారు. కాగా వ్యాపారులు మాత్రం వర్షపు జల్లు పడుతుండడంతో తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపడంతో పలువురు రైతులు అమ్మేందుకు నిరాకరించారు. దీంతో రహదారిపైనే పత్తి వాహనాలు బారులు తీరాయి. వాహనదారులు, ప్రజలు రాకపోకలను సాగించడానికి ఇబ్బందులకు గురయ్యారు. భద్రాద్రి జిల్లాలోని పాల్వంచ, కొత్తగూడెం, మణుగూరు, సుజాతనగర్, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి ఏన్కూరు, జూలూరుపాడు మండలాలకు చెందిన రైతులు బుధవారం పత్తిని విక్రయించేందుకు జూలూరుపాడుకు వాహనాలలో తెచ్చారు. ఆకాశం మేఘావృతమై వర్షం కురుసింది. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ వ్యాపారులు శాశ్వ త మార్కెట్ లేకపోవడంతో తాత్కలికంగా పత్తి కొనుగోళ్లు చేస్తున్నామని, సౌకర్యాలు లేవని, వర్షం కురుస్తుండడంతో పత్తి తడిసిపోతుందని సాకు చూపి పత్తి కొనుగోళ్లను నిలిపివేశారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంత మంది వ్యాపారులు మాత్రం తక్కువ ధరకు అడిగారు. క్వింటా పత్తిని రూ. 4500ల నుంచి రూ. 5000లకు అడిగారు. పత్తి నాణ్యంగా ఉన్నప్పటికీ మరి అంత తక్కువ ధరకు కొనుగోలు చేయడం పట్ల రైతులు విస్మయం వ్యక్తం చేశారు. ప త్తిని విక్రయించకుండా కొంత మంది రైతు లు నిరాశతో ఇళ్లకు వెళ్లిపోయారు. మరికొందరు రైతులు సూజాతనగర్‌లో అమ్ముకునేందుకు తీసుకెళ్లారు. కొందరు రైతులు తీసుకు వచ్చిన పత్తిని వెనక్కి తీసుకెళ్లలేక వ్యాపారు లు అడిగిన ధరకే విక్రయించారు. పత్తి కొనుగోళ్లపై మార్కెట్‌శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ తక్కువ ధరకు పత్తిని కొనుగోలు చేసి రైతులకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ. 8110లు ఉండగా వ్యాపారులు రూ. 5వేలకు కొనుగోలు చేయడం తగదన్నారు. సుమారు 2 వేల క్వింటాల పత్తిని రైతులు వెనక్కి తీసుకెళ్లారు.

కొత్తగూడెం రైల్వేస్టేషన్‌లో నాటుబాంబు కలకలం

» బాంబును కొరికి మృతి చెందిన వీధికుక్క

» అడవి జంతువులను వేటాడటానికి తయారు చేసిన నాటుబాంబు !

» సోషల్ మీడియాలో ప్రచారం చేయొద్దు భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు



శునకం మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్ సిబ్బంది, పోలీసులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్)లో నాటు బాంబు బుధవారం కలకలం రేపింది. ఈ నాటు బాంబును ఓ వీధి శునకం కొరకడంతో పేలిపోయి శునకం మృతి చెందడం చర్చనీయాంశమైంది. ఈ శబ్దం ఒక్కసారిగా పెద్దగా వినిపించడంతో రైల్వే స్టేషన్ ప్రాంగణంలో విధుల్లో ఉన్న సిబ్బంది, ప్రయాణికులు భయాందోళన చెందారు. నాటు బాంబు పేలిన విషయం తెలుసుకున్న రైల్వే జీఆర్పీ, ఆర్పీఎఫ్, కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని డాగ్ స్క్వాడ్‌కు సమాచారం అందించారు. బాంబు పేలిన ప్రాంతాన్ని, మృతి చెందిన ఆ శునకాన్ని నిశితంగా డాగ్ స్క్వాడ్‌ను పరిశీలించి అనుమానిత రైల్వే ట్రాక్, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ క్రమంలో ఐదు నాటు బాంబులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ నాటు బాంబులను నిర్జీవ ప్రదేశంలోనిర్వీర్యం చేసి రక్షణ చర్యలను చేపట్టారు. దీంతో సిబ్బంది, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. స్టేషన్ ప్రాంగణంలో చెత్త కుప్పలలో పడవేసి ఉన్న సంచిని శునకం తీసుకొని వెళ్తున్న క్రమంలో బయట పడ్డ ఉల్లిగడ్డ ఆకారంలో ఉన్న ఆ బాంబును శునకం కొరకడంతో మృతి చెందినట్లు తేల్చారు. ఈ సంఘటన సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో కొత్తగూడెం ప్రజలు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. ఇదిలా ఉండగా మంగళవారం రైల్వే స్టేషన్ ఆవరణలో ఒక నాటు బాంబు పేలినట్లు పాదాచారులు తెలియజేసినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్పీఎఫ్ ఎస్ఐ సాయి, ఏఎస్ఐ నరసింహస్వామి, జీఆర్పీ సిబ్బంది అశోక్, కొత్తగూడెం త్రీటౌన్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్లు శివప్రసాద్, కరుణాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడవి జంతువులను వేటాడటానికి తయారు చేసిన నాటు బాంబు అయ్యుంటుందని ...సోషల్ మీడియాలో ఈ సంఘటనపై తప్పుడు ప్రచారం చేయొద్దని ఎస్పీ రోహిత్‌రాజు ఒక ప్రకటనలో కోరారు. రైల్వే స్టేషన్ ప్రాంగణంలో గుర్తు తెలియని వ్యక్తి ఆ నాటు బాంబుల సంచిని చెత్త కుండీల్లో పడేసి ఉంటారని, ఆ సంచిని తీసుకొని శునకం వెళుతున్న క్రమంలో ఆ నాటు బాంబు బయటకు వచ్చి ఉంటుందని తెలిపారు. ఆ బాంబును కొరకడంతో ఆ శునకం మృతి చెంది ఉంటుందని, సంచిని పడేసిన వారి గురించి విచారణ చేపడుతున్నామని తెలిపారు. ఘటనలో మరే విధమైన కోణం లేదని ఎస్పీ నిర్ధారించారు.

ఏకగ్రీవాల్లో కాంగ్రెస్‌దే హవా

(5వ పేజీ తరువాయి)

ప్రక్రియ నడుస్తోంది. పలు పంచాయతీల్లో ఒక్కొక్కరు నామినేషన్ వేశారు. అందు లో ఒకటి కాంగ్రెస్ దక్కించుకోగా, ఒకటి సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ దక్కించుకుంది. అయితే వీటిని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. కొన్ని పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. రెండో విడత జరుగుతున్న మండలాల్లో కొన్నిపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అయితే వాటిని అధికారికంగా నామనేషన్ల ఉపసంహరణ అనంతరం ప్రక టించాల్సి ఉంది. నేలకొండపల్లి మండలం ఆచార్లగూడెం సర్పంచ్‌గా కొలికపంగు ఉప్పలమ్మ కాంగ్రెస్, కూసుమంచి మండలం లాల్ సింగ్ తండా సర్పంచ్‌గా భూక్యా సావిత్రి ఏకగ్రీవమయ్యాయి.

తిరుమలాయపాలెం మండలం తిమ్మక్కపేట పంచాయతీ సర్పంచ్‌గా సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ బలపరిచిన రేపాకుల భద్రమ్మ ఏకగ్రీవం అయ్యారు. కామేపల్లి మండలంలో పాత లింగాల సర్పంచ్‌గా కిన్నెర సుజాత ఏకగ్రీవంగా ఎన్నికకాబోతున్నారు. దీనిపై అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది.

ఎస్టీ ఓటర్లు లేక.. మిగిలినవారు వేయక

కొత్తగూడెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పాల్వంచ మండలంలోని పాండురంగాపురం పంచాయతీలో ఎప్పుడు ఎన్నికలొచ్చినా హోరాహోరీ పోరు నడుస్తూ ఉంటుంది. కానీ ఈ సారి మాత్రం అక్కడ ఒక్క నామినేషన్ కూడా వేయకపోవడంతో ఎన్నికలు జరగని పరిస్థితి నెలకొంది. పంచాయతీ పరిధిలో మొత్తం ఎనిమిది వార్డులుండగా.. సర్పంచ్, నాలుగు వార్డులను ఎస్టీలకు, మరో నాలుగు వార్డులను జనరల్ స్థానాలకు కేటాయించారు. అయితే అక్కడ ఒక్క ఎస్టీ ఒటరు లేకపోవడంతో ఆయా స్థానాలకు నామినేషన్ దాఖలు కాలేదు. దాంతో జనరల్ స్థానాల వారు సైతం నామినేషన్లు వేయకూడదని నిర్ణయించుకుని ముందుకురాలేదు. ఫలితంగా అక్కడ ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. దాంతో తాత్కలికంగా అధికారులు ఆ పంచాయతీలో ఎన్నికలను వాయిదా వేశారు. కాగా తొలివిడత నామినేషన్ల ఉపసంహరణ ముగిసే సమయానికి జిల్లాలో 13పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. వాటిల్లో దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, గంగోలు, కోయనర్సాపురం, డి. కొత్తూరు, పెద్ద కమలాపురం, పినపాక మండలంలోని పాతరెడ్డిగూడెం, జగ్గారం, కృష్ణాపురం పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. బూర్గంపాడు మండలంలోని మోరంపల్లి బంజర, పినపాక పట్టీ నగర్, నకిరిపేట, లక్ష్మీపురం, కృష్ణానగర్ పంచాయతీలు ఏకగ్రీవమవగా... వాటిల్లో లక్ష్మీపురం పంచాయతీ రూ. 30 లక్షలు, మోరంపల్లి బంజరలో రూ.15 లక్షలు గ్రామాభివృద్ధి కోసం వెచ్చించేందుకు ఒప్పుకున్నవారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సమాచారం. రెండోవిడతలో అశ్వారావుపేట మండలం రామన్నపేట, మద్దిగూడెం గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి.

తలుపులకు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు

ఖమ్మం క్రైం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఇంటి వెనుక తలుపులకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించిన సంఘటన బుధవారం తెల్లవారుజామున ఖమ్మం నగరంలో జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని రాపర్తినగర్ బీసీ కాలనీకి చెందిన నాగేశ్వరరావు అనే ఆటోడ్రైవర్ మంగళవారం రాత్రి సమయంలో ఆటోతో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి తెల్లవారుజామున సమయంలో ఇంటి వద్దకు రాగానే ఇంటి వెనుక తలుపుల నుంచి పొగ వస్తుంది. దీంతో కేకలు వేసి ఇంటిలోని కుటుంబ సభ్యులను బయటకు తీసుకువచ్చాడు. సమాయానికి నాగేశ్వరరావు ఇంటికి రావడంతో పెను ప్రమాదం తప్పింది. కాగా ఈఘటనపై బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఖమ్మం క్రైం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నడుచుకుంటు వెళ తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కుని పారిపోయిన సంఘటన మంగళవారం రాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. విజయనగర్ కాలనీకు చెందిన ఓ మహిళ రోడ్డుపై నడుచు కుంటు వెళుతుండగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనం పై మంకీ క్యాప్ ధరించి మహిళ మెడలో గొలుసు లాక్కుని పారిపోయాడు. మహిళ కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి వచ్చేలోపే సదరు వ్యక్తి పారిపోయాడు. దీంతో బాధితురాలు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఎన్నడు.. మారేనో?

» చెత్తాచెదారం, వ్యర్థాలతో నిండిపోయిన పాత ఎన్టీఆర్ కాల్వ

» ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

» పట్టించుకోని అధికారులు



మురుగుతో నిండిన పాత ఎన్టీఆర్ కాలువ

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎప్పుడూ ఇదేతీరు... ఎన్నడు మారేను అనే చందంలా ఉంది పాత ఎన్టీఆర్ కాలువ పరిస్థితి. చెత్తాచెదారం, వ్యర్థాలతో పేరుకుపోయి స్థానికులకు అనారోగ్య సమస్యలతో పాటు మురుగుకూపంలా కనిపిస్తున్న ఈ కాలువ సింగరేణి కారణంగా నిరూపయోగంగా మారగా చెత్త వేయకుండా చూడాలని, మట్టితో చదును చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. రెండు దశాబ్ధాల క్రితమే ప్రాభవం కోల్పోయి నీరు పారే పరిస్థితి లేని ఈ కాలువ అంతకముందు కొన్ని వందల ఎకరాలకు సాగునీటిని అందించింది. ఓసీ కారణంగా కాలువ సింగరేణి పరిధిలోకి వెళ్లగా పట్టణం శివారులోని వేశ్యకాంతల చెరువు సమీపంలో ప్రత్యామ్నాయ కాలువను ఏర్పాటు చేశారు. గతంలో పలువురు చిన్నారులతో పాటు వృద్ధులు డెంగ్యూతో పాటు విషజ్వరాల బారిన పడినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

పట్టణంలో సేకరించిన తడిపొడిచెత్తను గతంలో మునిసిపాలిటీ ట్రాక్టర్ల ద్వారా ఇక్కడే డంప్ చేసేవారు. తరచూ ఇలాగే జరుగుతుండగా అధికారులు చర్యలు తీసుకోవడంతో ఇప్పుడు మునిసిపల్ ట్రాక్టర్లు అటువైపు వెళ్లడం లేదు. అయితే స్థానికులు, తోపుడుబండ్లు, వ్యాపారులు, బిల్డర్లు, ల్యాబ్, ఆసుపత్రుల నిర్వాహకులు గృహ నిర్మాణవ్యర్థాలు, కుళ్లిన కూరగాయలు, పండ్లు, చెత్తాచెదారం, వ్యర్థాలను రాత్రిపూట గుట్టు చప్పుడు కాకుండా డంప్ చేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు, కుక్కలు, కోతులు, కోళ్లు ఆహారంగా తీసుకోవడంతో రోగాలపాలవుతున్నాయని, సమీప ప్రాంతంలోని విరాట్‌నగర్, ద్వారకాపూరి కాలనీ, జంగాలకాలనీలలో ప్రజలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నామని వాపోతున్నారు. పైగా చెత్తాచెదారానికి నిప్పు పెట్టడంతో సరిగా దహనమవ్వగా పొగచూరి ఇళ్లపైకి రావడంతో శ్వాసపీల్చుకోవడంలో ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కాలువ వెంట దర్శనమిస్తున్న చెత్తాచెదారం

చెత్తవేస్తే చర్యలు తీసుకుంటాం...

● కొండ్రా నర్సింహ, మునిసిపల్ కమిషనర్, సత్తుపల్లి

పాత ఎన్టీఆర్ కాలువలో మునిసిపల్ ట్రాక్టర్లతో చెత్తవేయడాన్ని నివారించాం. అలాచేసినట్లయితే చర్యలు తీసుకుంటున్నాం. ఇలా ప్రభుత్వ స్థలాల్లో అనుమతులు లేకుండా చెత్తవేయడం నేరమని, తమకు సమాచారం ఇవ్వాలి. డంపింగ్‌ను నివారించేందుకు చర్యలతో పాటు హెచ్చరిక బోర్డులు పెడతాం. ప్రజారోగ్యం నిమిత్తం అందరూ సహకరించాలి.

జనావాసాల్లోకి చుక్కల దుప్పి పిల్ల

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జనావాసాల్లోకి చేరిన చుక్కల దుప్పి పిల్లని సురక్షితంగా నీలాద్రి అర్బన్ పార్కులో వదిలిన సంఘటన బుధవారం సత్తుపల్లి పట్టణంలో చోటుచేసుకుంది. ఎఫ్‌డీవో వాడపల్లి తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని బైపాస్ రోడ్‌లో ఓ ఇంటిలోకి చుక్కల దుప్పి పిల్ల చేరినట్లు సమాచారం అందగా వేగంగా స్పందించి సంఘటనా స్థలానికి చేరుకుని స్వాధీన పరుచుకున్నామన్నారు. ఎటువంటి గాయాలు లేనందున దుప్పిని నీలాద్రి అర్బన్ పార్క్‌లో వదిలేశామని, దుప్పుల విషయంలో ఎటువంటి సమాచారం అయినా తమకు చేరవేయాలని ఆమె సూచించారు.

ధాన్యం లారీ పట్టివేత

మధిర రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నుంచి తెలంగాణలోకి అక్రమంగా వరి ధాన్యం తరలిస్తున్న లారీని బుధవారం వ్యవసాయ, రెవెన్యూ అధికారులు తెలంగాణ-ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన మండలంలోని దేశినేనిపాలెం వద్ద పట్టుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం సన్నరకాలకు రూ.500బోనస్ ఇస్తున్న నేపథ్యంలో తెలంగాణలో ఆంధ్రాలోని సన్నరకం ధాన్యాన్ని ఇచ్చే రూ.500బోనస్ పొందేందుకు అక్రమంగా వరిధాన్యాన్ని రవాణా చేస్తున్నారు. ధాన్యంతో ఉన్న లారీని సరిహద్దు చెక్‌పోస్టు వద్ద అధికారులు తనిఖీ చేయగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ధాన్యం లోడ్ లారీని పట్టుకుని వ్యవసాయ అధికారులు మధిర టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో టౌన్ పోలీసులు లారీని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వస్త్రాల నిర్వహణ.. ఇకపై దేవస్థానానిదే!

(5వ పేజీ తరువాయి)

ఇచ్చినట్లు తెలిసింది. దాని ఆధారంగా భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకొని నోటీసు జారీ చేసినట్లు తెలుస్తోంది.

దేవస్థానం నిర్వహించాలనే యోచనలో ఉంది

● ఈవో దామోదర్‌రావు

వస్త్రాల విక్రయ కేంద్రం నిర్వహణపై తరచూ అవకత వకలు, ఆరోపణలు వస్తుండడంతో దేవస్థానమే స్వయంగా నిర్వహించాలనే యోచనలో ఉంది. ఇది ప్రతిపాదన దశలోనే ఉన్నప్పటికీ.. పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. వస్త్రాల విక్రయ కాంట్రాక్టర్‌కు నోటీసు జారీ చేసిన విషయం వాస్తవమే. 48 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించాం. అనంతరం నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

జాతీయ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఆర్వపల్లి రాధాకృష్ణ

ఇల్లెందు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని మార్గదర్శిని హైస్కూల్ సౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ జాంబోరిలో పతకాలు సాధించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో నవంబరు 23 నుంచి 30వ తేదీ వరకు వారం రోజుల పాటు జరిగిన భారత సౌట్స్ అండ్ గైడ్స్ 19వ జాతీయ జంబొరిలో ఇల్లెందు మార్గదర్శిని పాఠశాల నుంచి తొమ్మిది మంది స్కౌట్స్, ఆరుగురు గైడ్స్ తెలంగాణ రాష్ట్రం తరుపున పాల్గొన్న వివిధ పాఠశాలలతోపాటు పాల్గొన్నారు. వీరికి పాఠశాల స్కౌట్ మాస్టర్ అజిత్ కుమార్ సారథ్యం వహించారు. ఈ జంబొరిలో దాదాపు 250 అంశాలలో వివిధ స్థాయిలలో పోటీలు నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొని బహుమతులు గెలుపొందారని ప్రిన్సిపాల్ ఆర్వపల్లి రాధాకృష్ణ తెలిపారు. బుధవారం ఈ మేరకు పాఠశాలలో జరిగిన అభినంధన సభలో మార్గదర్శిని పాఠశాల డైరెక్టర్లు దమ్మాలపాటి వెంకటేశ్వర్‌రావు, యాదగిరి రాంబాబు, ఆర్వపల్లి రాధాకృష్ణ జంబొరిలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు.

వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేయాలి

అశ్వారావుపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అభివృద్ధిలో విద్యార్థులు భవిష్యత్‌లో తనదైన ముద్రవేయడం ద్వారా వ్యవసాయ అభివృద్ధికి పాటుపడాలని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. హేమంత్ కుమార్ అన్నారు. బుధవారం జాతీయ వ్యవసాయ విద్యా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని వివిద పాఠశాలలకు సంబంధించిన విద్యార్థులకు కళాశాలలో క్షేత్ర, ప్రయోగాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డా.హేమంత్ మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన పరిశోధనలు, పంటలలో అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు ప్రత్యేక స్థానం ఉన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వ్యవసాయానికి సంబంధించి నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. వ్యవసాయంలో జరిగే మార్పులు, ఆధునీకరణ, మట్టి పరీక్షలు, యాం త్రీకరణ, ఉద్యానవన మొక్కలు, సాంకేతికత మొదలగు విషయాలను విద్యార్థులకు ప్రదర్శన ద్వారా చూపించారు. కార్యక్రమంలో ఐవీఎస్ రెడ్డి, రాంప్రసాద్, నాగాంజలి, నీలిమ, కృష్ణతేజ, దీపక్ రెడ్డి, శ్రావిత, హిమశ్రీ, చందన, పావన కళ్యాణి, సాయిదుర్గ పాల్గొన్నారు.



జాతీయ వ్యవసాయ విద్యా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఆదర్శప్రాయుడు సోడే రామయ్య

- హ్యాట్రిక్ సర్పంచ్‌గా.... మూడుసార్లు ఎంపీగా..
- ఎన్నికల ఖర్చు పెరగడంతో పోటీ చేయలేకపోతున్నాం!
- 'ఆంధ్రజ్యోతి'తో సోడే రామయ్య



భద్రాచలం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఎంపీగా మూడుసార్లు పని చేసిన సోడే రామయ్య మనందరికి గుర్తుండే ఉంటుంది. ఆయన తన రాజకీయ ప్రస్థానం తొలి నాళ్లలో కూనవరం మండలం కొండ్రాజు పేట సర్పంచ్‌గా పని చేసి ఆదర్శప్రాయుడుగా నిలిచారు. 1942లో కూనవరం మండలం కొండ్రాజుపేటలో జన్మించిన సోడే రామయ్య 1958 సీపీఐ సభ్యత్వం తీసుకొని తన రాజకీయ ప్రస్థానంను ప్రారంభించారు. ఈ క్రమంలో తొలిసారిగా 1964లో సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు. నాటి నుంచి వరుసగా మూడుసార్లు హ్యాట్రిక్ సర్పంచ్‌గా ఎన్నిక య్యారు. అలాగే కూనవరం సమితి అధ్యక్షులుగా కూడా పని చేశారు. యన హయాంలో గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసి ఆదర్శ ప్రజాప్రతినిధిగా నిలిచారు. ఇదే సమయంలో పార్టీ పెద్దల మన్ననలు సైతం పొందారు. ఐదుసార్లు భద్రాచలం ఎంపీగా పోటీ చేసిన ఆయన మూడుసార్లు విజయం సాధించడం విశేషం. 1984లో తొలిసారిగా భద్రాచలం లోక్‌సభస్థానం నుంచి సీపీఐ అభ్యర్థిగా పోటీ చేసిన సోడే రామయ్య విజయం సాధించారు. 1996, 1998లో ఎంపీగా ఎన్నికయ్యారు.

ఆదర్శప్రాయుడు సోడే రామయ్య

హ్యాట్రిక్ సర్పంచ్‌గా, మూడుసార్లు ఎంపీగా ఒకసారి సమితి అధ్యక్షులుగా ప్రజలచేత ఎన్నుకోబడ్డ సోడే రామయ్య ఆరున్నర దశాబ్దాల రాజకీయ జీవితంలో నీతిగా, నిజాయితీగా రాజకీయాలు చేశారనే పేరుంది. ఒక్కసారి సర్పంచ్, ఎమ్మెల్యేగా, లేదా ఎంపీగా పని చేస్తే కోట్లు గడిస్తున్న ఈ రోజుల్లో అత్యంత సామాన్యమైన జీవితాన్ని ఏజెన్సీలో గడుపుతున్నారు సోడే రామయ్య. దశాబ్దా కాలం క్రితం వరకు భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గంతో అనుబంధం కలిగి ఉన్న కూనవరం మండలంలోని కొండ్రాజుపేటకు చెంది(ప్రస్తుతం ఏపీలోని రంపచోడవరం జిల్లా)న సోడే రామయ్య తన శేష జీవితాన్ని అక్కడే గడుపుతున్నారు.

ఎన్నికల ఖర్చు పెరగడంతో పోటీ చేయలేకపోతున్నాం

- ఆంధ్రజ్యోతితో మాజీ ఎంపీ సోడే రామయ్య

ఏజెన్సీ ప్రాంతంకు చెందిన నేను ఆనాడు సర్పంచ్‌గా, సమితి అధ్యక్షులుగా, ఎంపీగా పోటీ చేసిన సమయంలో పార్టీయే నా ఎన్నికల ఖర్చును భరించేది. నేడు ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసేవారే కోట్లు ఖర్చు చేస్తున్న రోజులివి. నాటికి నేటికి రాజకీయాల్లో ఎంతో మార్పు వచ్చింది. అందుకే మాలాంటి వారు ఎన్నికల ఖర్చు పెరగడంతో పోటీ చేయలేకపోతున్నాం.

పల్లె సమరం 2025

ఎన్నికల బరిలో భార్య భర్తలు!

నాడు తాత, నానమ్మ.. నేడు మనవడు, మనువరాలు



నాగారం సర్పంచ్, వార్డుమెంబర్‌కు పోటీ చేస్తున్న భార్య, భర్తలు

పాల్వంచ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల బరిలో భార్యభర్తలు ఒకే పార్టీ తరుపున నా మినేషన్లు వేశారు. ఒకరు సర్పంచ్ పదవికి నామినేషన్ వేయగా, మరొకరు వార్డు మెంబర్‌గా నామినేషన్ వేశారు. మంగళవారం నాగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నాగారం సర్పంచ్ పోటీలో ఒకరు, వార్డు మెంబర్‌గా మరొకరు వేసిన నామినేషన్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. వీరిద్దరి పోటీపై చర్చ సాగుతుంది. నాగారం గ్రామపంచాయతీ సర్పంచ్ పోటీలో భానోత్ ప్రభావతి నామినేషన్ వేయగా, ఐదవ వార్డులో ప్రభావతి భర్త వినాయక్ పోటీ చేస్తున్నారు. భార్యభర్తలు ఇరువురికీ కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలపగా వీరు నామినేషన్ వేశారు. వీరిద్దరూ ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నారు. అయితే భానోత్ వినాయక్ తాత భానోత్ రాజారాం నాగారం గ్రామపంచాయతీ సర్పంచ్‌గా 5సార్లు ఎన్నికైయ్యారు. తరువాత వినాయక్ నానమ్మ మంగమ్మ ఒకసారి సర్పంచ్‌గా ఎన్నికైంది. వీరి వారసత్వంగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మద్దతుతో భానోత్ ప్రభావతి సర్పంచ్‌గా, వినాయక్ వార్డు మెంబర్‌గా పోటీ చేస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అనంతరం గెలుపు ధీమాతో ప్రచారం చేస్తామని భార్య భర్తలిద్దరూ తెలిపారు.

ఎన్నికలకు దూరంగా మొదటిసారి 'పేట'

పేరాయిగూడెం, గుర్రాలచెరువు పంచాయతీలు కూడా...

ఎన్నికల వేళ.. నిశ్శబ్దంగా పట్టణం

మున్సిపాలిటీగా ఏర్పడడంతో సందడి కోల్పోయిన 'పేట'

అశ్వారావుపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎందరో ప్రముఖులకు స్థానం కలిపించిన అశ్వారావుపేట నియోజకవర్గం పెను రాజకీయాలకు సంచలనంగా మారింది. కానీ ఈ నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేట పట్టణం మొదటిసారి గ్రామ పంచాయతీ ఎన్నికలకు దూరంగా ఉండిపోయింది. ఎన్నికలు వచ్చాయంటే ఎన్నో సంచలనాలకు కేంద్రంగా ఉండే అశ్వారావుపేట పట్టణంలో ఈసారి గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగటం లేదు. దీంతోపాటు పట్టణంతో కలసి ఉన్న పేరాయిగూడెం, గుర్రాలచెరువు పంచాయతీలలో ఈ దఫా ఎన్నికలు జరుగటం లేదు. దీంతో ఆయా పంచాయతీల పరిధిలో మైకుల రణగొణ ధ్వనులు, సమీకరణాలకు దూరంగా ఉండిపోయింది. గత ఏడాది డిసెంబరులో అశ్వారావుపేట మేజర్ పంచాయతీ, పేరాయిగూడెం, గుర్రాలచెరువు పంచాయతీలు కలిపి అశ్వారావుపేట మునిసిపాలిటీగా ఏర్పడింది. అశ్వారావుపేట మేజర్ పంచాయతీలో 22,836 మంది, పేరాయిగూడెంలో 8,682 మంది, గుర్రాలచెరువులో 1248 జనాభా కలిగి ఉండటంతో ఈ మూడు పంచాతీలను కలపి "అశ్వారావుపేట మునిసిపాలిటీ"గా ఏర్పాటయ్యింది. ప్రస్తుతం మునిసిపాలిటీ ఎన్నికలు జరగటం లేదు. కేవలం గ్రామ పంచాయతీ ఎన్నికలు మాత్రమే జరుగుతున్నాయి. దీంతో గతంలో పంచాయతీలుగా ఉన్న అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు పంచాయతీల్లో పంచాయతీ ఎన్నికల చరిత్రలో మొదటిసారిగా ఎన్నికలకు దూరంగా ఉండి పోవాలసి వచ్చింది.



అశ్వారావుపేట పట్టణ వ్యూ (ఫైల్)

నాడు సర్పంచ్... నేడు వార్డుసభ్యుడిగా...



సోమిని శివశంకర వరప్రసాద్

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా మాజీ సర్పంచి అంటే తిరిగి సర్పంచిగానో ఎంపీటీసీగానో పోటీచేస్తారు. కాని తాజా మాజీ సర్పంచి ఒక వార్డుసభ్యుడిగా పోటీలో నిలిచాడు. దీంతో సర్పంచిగా ఐదేళ్ల గ్రామాన్ని పాలించిన వ్యక్తి ఓ వార్డు సభ్యుడిగా పోటీలో దిగటం చర్చకు దారితీసింది. వివరాల్లోకి వెళితే మండలంలోని వేదాంతపురం తాజా మాజీ సర్పంచి సోమిని శివశంకర వరప్రసాద్ మంగళవారం వార్డు సభ్యుడిగా ఊట్లపల్లి నామినేషన్ కేంద్రంలో నామినేషన్ పత్రాలు సమర్పించాడు. తాజాగా పంచాయతీ ఎస్టీ మహిళకు రిజర్వ్ కావటంతో తిరిగి పోటీచేసేందుకు అవకాశం లేకుండా పోయింది. బీఆర్ఎస్ తరుపున మహిళా అభ్యర్థి నామినేషన్ దాఖలు చేయగా తాజా మాజీ సర్పంచి 8వ వార్డుకు నామినేషన్ దాఖలు చేశాడు.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ముఖ్యమైన పత్రాలివే..

కొత్తగూడెం కలెక్టరేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికల్లో పాల్గొనే ఎన్నికల అధికారులకు, సిబ్బందికి వివిధ పత్రాలపై అవగాహన ఉన్నప్పుడు మాత్రమే ఎన్నికలు సజావుగా నడపడానికి వీలు కలుగుతుంది. ఫారం-1 గ్రామపంచాయతీ నోటిఫికేషన్‌కు సంబంధించినది, ఫారం-2 ఎంపీటీసీ, జడ్పీటీసీ సంబంధించిన నోటిఫికేషన్, ఫారం-3 గ్రామపంచాయతీ నోటిఫికేషన్, ఫామ్- 4 ఎంపీటీసీ జడ్పిటిసి నోటిఫికేషన్ ఫామ్, ఫారం-5డే వైజ్ నామినేషన్ జాబితా, ఫామ్ -6 వ్యాలీడ్ నామినేషన్ లిస్ట్, ఫామ్-7 విత్‌డ్రా నోటీస్, ఫారం-8 విత్‌డ్రా అభ్యర్థుల జాబితా, ఫారం-9 ఫైనల్ పోటీలలో ఉన్న అభ్యర్థులు ఆయా ఫారాలను సమర్పించాల్సి ఉంటుంది. సదరు ఫారాల వివరాలు ఇలా... ఫామ్-10 ఏకగ్రివ ఎన్నిక ఫలితాల ప్రకటన, ఫామ్-11 ఎలక్షన్ ఏజెంట్, ఫామ్-11ఏ ఎలక్షన్ ఏజెంట్ క్యాన్సిలేషన్, ఫామ్-12 పోలింగ్ ఏజెంట్, ఫామ్-12ఏ పోలింగ్ ఏజెంట్ క్యాన్సిలేషన్, ఫామ్-13 కౌంటింగ్ ఏజెంట్, ఫామ్-13ఏ కౌంటింగ్ ఏజెంట్ క్యాన్సిలేషన్, ఫారం-14 పోస్టల్ బ్యాలెట్ అప్లికేషన్, ఫామ్-15ఈ డీసీ అప్లికేషన్, ఫామ్-16ఈ డీసీ సర్టిఫికెట్, ఫామ్-17 పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్, ఫామ్-18 పోస్టల్ బ్యాలెట్ కవర్, ఫామ్-19 పోస్టల్ బ్యాలెట్ బిగ్‌కవర్, ఫామ్-20 పోస్టల్ బ్యాలెట్ ఇన్‌స్ట్రక్షన్స్, ఫోన్-21 చాలెంజ్ ఓటర్ల లిస్ట్, ఫామ్-22 బ్లైండ్ అండ్ ఇన్ఫిమ్ వాటర్స్ డిక్లరేషన్, ఫామ్-23 బ్లైండ్ అండ్ ఇన్ఫార్మ్ వాటర్ల లిస్ట్, ఫామ్-24 టెండర్ ఓటర్ లిస్ట్, ఫామ్-25 బ్యాలెట్ పేపర్ అకౌంట్, ఫామ్-26 పోలింగ్ స్టేషన్ వైజ్ ఫైనల్ రిజల్ట్, ఫామ్-27 ఫైనల్ రిజల్ట్ రిపోర్ట్, ఫామ్-28 ఎలక్షన్ రిటర్న్, ఫామ్ -29 విన్నింగ్ డిక్లరేషన్ ఫామ్.

స్వేచ్ఛాయుత ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి

ఎన్నికల నియమావళి ఉల్లంఘున జరగకుండా

పకడ్బందీ ప్రణాళికతో పోలీసు విధులు

ఎన్నికల విధులు, విధివిధానాలపై

పోలీస్ సిబ్బందికి అవగాహన కార్యక్రమంలో

ఖమ్మం కమిషనర్ సునీల్ దత్

ఖమ్మం రూరల్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వేచ్ఛాయుత వాతావరణంతో కూడిన నిష్పక్షపాత ఎన్నికలు జరిగేలా సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల బందోబస్తు విధులు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న పోలీస్ సిబ్బందికి ఎన్నికల విధులు, విధివిధానాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి, శాంతి భద్రతల పరిరక్షణ అంశాలపై ఖమ్మం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దతండాలోని కిసాన్ ఫంక్షన్ హాల్లో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియంత్రణలో క్రమశిక్షణకు లోబడి పనిచేయాలన్నారు. ఎన్నికల నియమావళిపై సమగ్ర అవగాహన ఏర్పరుచుకుని, ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసేంతవరకు ప్రవర్తన నియమావలి అమల్లో ఉంటుందన్నారు. అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. శాంతిభద్రతల విషయంలో కఠినంగా ఉండాలని సూచించారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం వంటి ప్రభావాన్ని నిలువరించేందుకు ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటోందని గ్రహించాలన్నారు. స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్, ఫ్లెయింగ్ స్క్వాడ్‌టీమ్స్, సరిహద్దు చెక్ పోస్టులు, రూట్ మొబైల్ పార్టీలు, ఎన్నికల ముందు, పోలింగ్ రోజు, ఓట్ల లెక్కింపు సందర్భంగా నిర్వహించే విధుల్లో పూర్తి అవగాహన ఉండాలన్నారు. అదేవిధంగా సభలు, సమావేశాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఘర్షణ వాతావరణం లేకుండా పోలీస్‌పెట్రోలింగ్ ముమ్మరంగా చేయాలని బెల్ట్‌షాపుల్లో మద్యం విక్రయాలను నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా అండ్‌ఆర్డర్ ప్రసాద్‌రావు, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐలు రాజు, మురళి, సంజీవ్, తిరుపతి, డివిజన్ ఎస్సైలు పాల్గొన్నారు.

మీరిచ్చే డబ్బులు... బహుమతులు మాకొద్దు

మా సమస్యను పరిష్కరించండి చాలు

గ్రామ పంచాయతీ ఒకటో వార్డులో వెలసిన ఫ్లెక్సీ..



ఫ్లెక్సీఏర్పాటు చేసిన దృశ్యం

భద్రాచలం, డిసెంబర్3 (ఆంధ్రజ్యోతి): మీరిచ్చే డబ్బులు.. బహుమతులు మాకొద్దు.. దయచేసి అనేక ఏళ్లుగా ఇబ్బందులకు గురవుతున్న మా రోడ్డులోని మురుగుకాల్వ, రహదారిని బాగుచేయాలని విన్నపమని భద్రాచలం గ్రామ పంచాయతీ ఒకటో వార్డులో వెలసిన ఫ్లెక్సీ అందరిని ఆలోచింపజేస్తోంది. స్థానిక విస్తా కాంప్లెక్స్ పక్కనఉన్న రహదారిలో మురుగునీరు రహదారిపై ప్రవహించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గోదావరిలో పవిత్రస్నానం చేసి రామయ్య దర్శనం కోసం వచ్చే భక్తులు సైతం పడుతున్న అవస్థలు అంతా ఇంతా కాదు. ఈ విషయమై పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో పంచాయతీ ఎన్నికల వేళ స్థానికులు ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మాకు ఓటు వేసేందుకు మీరిచ్చే డబ్బులు బహుమతులు వద్దు సమస్యను పరిష్కరించండని స్థానికులు కోరడం ఎంతైనా సమంజసమని రాజకీయ నాయకులు అంగీకరిస్తున్నారు.

ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాల ఏర్పాటు

ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల వద్ద పంచాయతీ ఎన్నికల ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఎన్నికల విధులు నిర్వహించే ఓటర్లకు, అత్యవసర సేవల్లో పనిచేసే ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. దీనికోసం పోస్టల్ ఓటింగ్ కేంద్రం/ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రం సంబంధిత మండలాల ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

- మొదటివిడత పంచాయతీ ఎన్నికలు జరిగే కొణిజెర్ల, రఘునాథపాలెం, వైరా, బోనకల్, చింతకాని, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో ఈ నెల 5 నుంచి 10 వరకు, రెండవ విడత ఎన్నికలు జరిగే కామేపల్లి, ఖమ్మం రూరల్, కూసుమంచి, ముదిగొండ, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లో ఈనెల 8వ తేదీ నుంచి 13 వరకు, మూడవ విడత జరిగే ఏన్కూర్, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, తల్లాడ, వేంసూర్, సింగరేణి మండలాల్లో ఈనెల 11 నుంచి 16 వరకు సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల వద్ద ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి పోస్టల్‌బ్యాలెట్ సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లుచేసినట్లు ప్రకటనలో తెలిపారు.

డాక్టర్ మన్మోహన్ సింగ్ భూ విజ్ఞాన శాస్త్ర యూనివర్సిటీ నమూనా చిత్రం



ఐదేళ్లలో అంతర్జాతీయ స్థాయికి భూ విజ్ఞానశాస్త్ర వర్సిటీ

కనీసం రూ.1000 కోట్లు అవసరం

అనుబంధం అకాడమిక్ పరిశోధన రంగాలపై ప్రత్యేక దృష్టి

కొత్తగూడం ఎడ్యుకేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఐదేళ్లలో కొత్తగూడెం పరిధిలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ భూవిజ్ఞానశాస్త్రం అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలంగాణ కౌన్సిలింగ్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రతాపరెడ్డి నివేదిక అందజేశారు. అంతర్జాతీయ యూనివర్సిటీ స్థాయిలో ఉండడానికి కావలసిన నిధులు, మౌలిక సదుపాయాలు, పరిశోధన ప్రయోగశాలలు, అకాడమిక్ విభాగాలు, బోధన, బోధనేతర సిబ్బంది, ఉండాలంటే కనీసం రూ.1000 కోట్లు అవసరం ఉంటుంది. పై సౌకర్యాలు ఉన్నప్పుడు మాత్రమే ఈ భూవిజ్ఞానశాస్త్ర యూనివర్సిటీకి యూజీసీ(యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్) అనుమతి లభిస్తుంది. యూజీసీ గుర్తింపు ఉంటేనే అంతర్జాతీయ స్థాయిలో వెళ్లడానికి వీలు కలుగుతుంది.

భూవిజ్ఞానశాస్త్ర వర్సిటీ ముఖ్య లక్ష్యం

ఈ యూనివర్సిటీలో అకాడమిక్ రంగాల అభివృద్ధి, పరిశోధన, కొత్త అన్వేషణలు, సామాజిక భాగస్వామ్యం, సుస్థిర అభివృద్ధి, నైతిక విలువల అభివృద్ధి, మౌలికసదుపాయాలు, వనరుల వినియోగంపై ఈ యూనివర్సిటీ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచ స్థాయిలో వనరుల పునర్వినియోగంతో శక్తిఉత్పత్తి, సమస్యాత్మకంగా ఉన్న మినరల్స్‌పై పరిశోధన వినియోగాలు జరిగే విధంగా ఈ యూనివర్సిటీ ఉపయోగపడుతుంది. అంతర్జాతీయ స్థాయి భూగర్భ శాస్త్ర, ఎక్స్‌ప్లోరేషన్ పరిశోధనకు నిలయమైన ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలకు దీటుగా భూవిజ్ఞాన శాస్త్రవేత్తలను తయారు చేయాలని భావిస్తున్నారు. వాతావరణ మార్పులు, సుస్థిర పర్యావరణం చేపట్టిన ప్రాజెక్టుల్లో భాగస్వామ్యం కావడం, ఆయిల్ అండ్ నేచురల్ ఎక్స్‌ప్లోరేషన్, గ్రహాలు, అంతరిక్ష పరిశోధన రంగాలు, అమెరికా, యూరోప్ దేశాల్లో ఉన్న అంతర్జాతీయ పరిశోధనలకు దీటుగా శాస్త్రవేత్తలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రాబోయే ఐదేళ్లలో చేపట్టే ప్రణాళిక

డాక్టర్ మన్మోహన్ సింగ్ భూవిజ్ఞాన శాస్త్ర యూనివర్సిటీలో 2025- 30లో చేపట్టనున్న ప్రణాళికలను ముఖ్యమంత్రికి హైయర్ ఎడ్యుకేషన్ కమిషన్ ప్రతాపరెడ్డి కొత్తగూడెంలో అందజేశారు. ముఖ్యంగా ఇక్కడ గ్రాడ్యుయేష న్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పరిశోధన రంగాలు, సర్టిఫికెట్స్ ప్రోగ్రాం, జియాలజీ, జియో ఎన్విరాన్మెంటల్ సైన్స్, రివర్‌సైన్స్, పోల్ ఇండియా జియాలజీ, మైనింగ్ టెక్నాలజీ, జీఐఎస్, రిమోట్ సెన్సింగ్‌తో పాటు వివిధ రంగాలపై పరిశోధనలు, మౌలిక వసతులు, అకాడమిక్ హాస్టల్ భవనాలు, పరిశోధన ప్రయోగశాలలు, ఆర్ట్స్ ప్రయోగశాలలు, స్మార్ట్ తరగతి గదులు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గ్రిన్ క్యాంప స్, ఇండోర్, అవుట్‌డోర్ ఆట స్థలాలు ఫీల్డ్‌స్టే షన్స్‌పై అవగాహన చేయాలి. అనుబంధ గవర్నెన్స్, కెపాసిటీ బిల్డింగ్ తదితర వాటితో అనుబంధాలు కలిగి ఉంటాయి.

సబ్జెక్టులు..:

రాబోయే ఐదేళ్లలో బీఎస్సీ, ఎమ్మెస్సీతో జియాలజీ, ఎన్విరాన్మెంటల్ కోర్సులు, బీటెక్, ఎంటెక్, ఎంఎస్సీతో పాటు పీజీ, డిప్లమో కోర్సులు, ప్రకృతి విపత్తులు, జీఐఎస్ రిమోట్ సెన్సింగ్, సర్టిఫికెట్ కోర్సులు పెట్టనున్నారు. వీటితో పాటు అనేక రంగా ల్లో పరిశోధనలు ఎమర్జెన్సీ విభాగాల్లో కార్బన్ సీక్వెస్ట్ జియో హెల్త్, ప్లానెట్ జియో సైన్స్, రెన్యుబుల్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఎర్త్‌సైన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు.

అంతర్జాతీయ వర్సిటీలతో ఒప్పందాలు..

భౌగోళిక విజ్ఞానశాస్త్ర రంగంలో ప్రపంచంలో నెంబర్ వన్ స్థానంలో ఉన్న స్విట్జర్లాండ్‌లోని ఎర్త్ జూరిస్ పబ్లిక్ యూనివర్సిటీ, అమెరికాలోని ఆమెచేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, క్రేంబ్రిడ్జి వర్సిటీలతోనూ, యునైటెడ్ కింగ్‌డమ్ డారహ యూనివర్సిటీతోను, జాతీయస్థాయిలో ఐఐటీ ధన్బాద్, ఐఐటీ బెనారస్ హిందూ యూనివర్సిటీలతో వివిధ పరిశోధన, ఇతర రంగాలపై ఒప్పందం చేసుకోవాలని భావిస్తున్నారు.

బోధనేతర సిబ్బంది

భూవిజ్ఞానశాస్త్ర యూనివర్సిటీలో ప్రాథమిక దశలో ప్రొఫెసర్స్ అసోసియేటెడ్ ప్రొఫెసర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్, మొత్తం 64 మం ది బోధన సిబ్బంది అవసరం. 29మంది బోధనేతర సిబ్బంది, ప్రొఫెసర్స్ ఆఫ్ ప్రాక్టీస్ ప్రాంతానికి ఐదుగురుకి అవకాశం ఉంటుంది.

ఫైనాన్షియల్ లే అవుట్ ..

అకాడమిక్‌లో భాగంగా ప్రయోగశాలలు, పరికరాల కోసం రూ.115.7లక్షలు, సివిల్ పనుల కోసం రూ.1110లక్షలు మొత్తం 2025- 26 సంవత్సరానికి బడ్జెట్ రూ.1306.7లక్షలు అవసరం ఉంటుంది. ఈనిధులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఆ రాష్ట్రాల్లోని పరిశ్రమలకు సంబంధించిన సీఎస్ఆర్ నిధులు, ఇంటర్నేషనల్ గ్లాండ్స్, విద్యార్థుల ఫీజులు, పూర్వవిద్యార్థుల నుంచి విరాళాలు సేకరిస్తారు. రాబోయే ఐదేళ్లలో నిధుల కోసం సింగరేణి సంస్థలతో ఒప్పందాలు, టీఎస్ జెన్కో, ఐటీసీ బీపీఎల్, హెవీ వాటర్‌ప్లాంట్, ఆటమిక్ ఎనర్జీ, డీఆర్డీవో, ఎన్జీఆర్ తదితర సంస్థల నుంచి ఒప్పందాలతో నిధులు సేకరించాల్సి ఉంటుంది. పైవిధంగా అన్ని ఏర్పాట్లు అయిన అనంతరం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి యూజీసీ, అంతర్జాతీయ యూజీసీ అనుమతి పొందిన తర్వాతే జాతీయ, అంతర్జాతీయ రంగాల్లో అభివృద్ధి చెందడానికి వీలుకలుగుతుంది.

కిష్టారంలో ఘోర రోడ్డు ప్రమాదం

డివైడర్‌ను ఢీకొన్న కారు.. ముగ్గురి మృతి

మృతుల్లో ఇద్దరు యువకులు, ఓ మైనర్..

మరో ఇద్దరి పరిస్థితి విషయం

కుటుంబాలకు మంత్రి తుమ్మల సంతాపం, ఎమ్మెల్యే రాగమయి పరామర్శ

సత్తుపల్లిరూరల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మిత్రుడి గృహప్రవేశానికి హాజరయ్యేందుకని వెళ్తుండగా కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు మృతిచెందగా ఇద్దరికి తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన సత్తుపల్లి మండలం కిష్టారంలో బుధవారం తెల్లవారుజామున జరిగింది. సత్తుపల్లి పట్టణంలోని కొమ్మేపల్లి కాలనీకి చెందిన సిద్దేశి శ్రీనివాస రావు, శ్రీలత దంపతుల కుమారుడు జాయ్ (18) సత్తుపల్లిలోని ఓ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. ఇదే కాలనీలో కూలి పనులకు వెళ్లే మర్సకట్ల రాజబాబు, ప్రేమలత దంపతుల చిన్న కుమారుడు శశిధర్ (13) స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాలలో 6వ తరగతి చదువుతు న్నాడు. జాయ్ మంగళవారం రాత్రి 11గంటల తర్వాత శశివర్ధన్‌ను తీసుకుని తమ కారులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లికి వెళ్లి తమ మిత్రుడు, తలారి రాజు కుమారుడైన అజయ్ ను ఎక్కించుకుని చండ్రుగొండ మండలం మహమూద్‌నగర్ వెళ్లారు. అక్కడ ఎస్‌కే.అజ్గర్, జిలేఖాబీ దంపతుల చిన్న కుమారుడు సాజిద్ (25), ఎస్‌కే.ఖాసీం కుమారుడు ఇమ్రాన్‌ను ఎక్కించుకుని సత్తుపల్లికి బయల్దేరారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున మండలంలోని కిష్టారం గ్రామంలోకి ప్రవేశించిన సమయంలో అంబేద్కర్‌నగర్ వద్ద జాతీయ రహదారిపై డివైడర్‌ను కారు ఢీకొంది. ప్రమాద సమయంలో సాజిద్ కారును నడుపుతున్నాడు. కారు అతివేగంగా ఢీకొట్టడంతో ఒక్కసారిగా గాలిలోకి ఎగిరి రోడ్డుపై పడటంతో వాహనంలోని జాయ్, శశివర్ధన్ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రగాయాలైన సాజిద్, అజయ్, ఇమ్రాన్‌ను 108లో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాజిద్ మృతిచెందగా తీవ్రగాయాలైన అజయ్, ఇమ్రాన్ ను ఖమ్మం తరలించగా వారి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్టు సమాచారం. సంఘటనా స్థలాన్ని కల్లూరు ఏసీపీ పీ.వసుంధర యాదవ్, పట్టణ సీఐ టి.శ్రీహరి, ఎస్ఐ ప్రదీప్ సందర్శించారు. మితిమీరిన వేగానికి తోడు తెల్లవారుజామున మంచు విపరీతంగా కురుస్తుండటం వల్ల రోడ్డు కనిపించకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.



సిద్దేశి జాయ్, మర్సకట్ల శశిధర్, ఎస్‌కే.సాజిద్ (ఫైల్)



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్

మృతులలో చిన్నారి శశిధర్ గత ఆదివారమే తన పుట్టిన రోజు జరుపుకోగా కుమారులను కోల్పోయిన కుటుంబాల ఆర్తనాదాలతో ఆసుపత్రి ఆవరణ మిన్నంటింది. సమీప బంధువులైన సాజిద్, ఇమ్రాన్‌లు హైదరాబాద్‌లో డిగ్రీ ఫైనలియర్ చదువుతుండగా వారు ఇటీవల ఇంటికి వచ్చారు. మృతుల కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పట్టణ సీఐ కేసు నమోదు చేశారు.

సంఘటనా స్థలాన్ని సందర్శించిన కల్లూరు ఏసీపీ

మండలంలోని కిష్టారంలో జరిగిన ప్రమాద సంఘటనా స్థలాన్ని కల్లూరు ఏసీపీ పి.వసుంధర యాదవ్, పట్టణ సీఐ టి.శ్రీహరి, ఎస్ఐలు ప్రదీప్, అశోక్‌లు సందర్శించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మంత్రి దిగ్భ్రాంతి.. ఎమ్మెల్యే పరామర్శ

ప్రమాద విషయం తెలుసుకున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించిన జాయ్, శశిధర్, సాజిద్ మృతదేహాలను చూసిన అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.



మృతుల కుటుంబాలను ఓదార్చుతున్న ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి



కార్మిక వ్యతిరేక చట్టాలను తిప్పికొట్టాలి

ఖమ్మంఅర్బన్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ప్రభుత్వాలు తీసుకు వస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను కార్మికులు ఐక్యంగా తిప్పి కొట్టాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎం. సుబ్బారావు పిలుపునిచ్చారు. బుధవారం బోడేపూడి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన బీవీకే సమావేశంలో మాట్లాడారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించటం ప్రభుత్వాలు చేయాల్సి ఉండగా వాటిని వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదిలేసిందన్నారు. కార్యక్రమంలో బీవీకే మేనేజర్ వై. శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్‌కేఅఫ్జల్ మియా, టి.వెంకట్రావు, జి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

'పాలేరు'లో ముగిసిన నామినేషన్ల ఘట్టం

- శనివారం నామినేషన్ల ఉపసంహరణ
- ఏకగ్రీవం దిశగా పలు పంచాయతీలు

కూసుమంచి, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ముఖ్య ఘట్టమైన నామినేషన్ అంకానికి తెరపడింది. మంగళవారంతో నామినేషన్ల పర్వం ముగియడంతో ఇక అసలు సమరం మొదలుకానుంది. 6తేదీన శనివారం నామినేషన్ల ఉపసంహరణ, అభ్యర్థుల ప్రకటన ఉంటుంది. 7నుంచి హోరాహోరీగా ప్రజాక్షేత్రంలో తలపడనున్నారు. పాలేరుని యోజకవర్గంలో మొత్తం 134పంచాయతీలలో సర్పంచిలకు 781 నామినేషన్లు దాఖలయ్యాయి. 1222 వార్డులకు 2981 నామినేషన్లు దాఖలయ్యాయి.కూసుమంచి మండలంలో 41పంచాయతీలకు మొత్తం 250 సర్పంచికి నామినేషన్లు, వార్డులకు 853నామినేషన్లు దాఖలయ్యాయి.మూడోరోజున పోటాపోటీగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు అయ్యాయి.

ఒక సర్పంచ్ 27 వార్డులు ఏకగ్రీవం

నేలకొండపల్లి: మండలంలో నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. నామినేషన్ల పరిశీలనపూర్తి అయ్యింది. ఆచార్లగూడెం సర్పంచ్‌గా కాంగ్రెస్‌కు చెందిన కొలిక పంగు ఉప్పలమ్మ ఏకగ్రీవంగా ఎంపికయ్యింది. బీఆర్ఎస్‌కు ఉపాధ్యక్ష పదవితో పాటు 3వార్డులు, సీపీఎంకు ఒకటి, కాంగ్రెస్‌కు నాలుగు ఏకగ్రీవం అయ్యాయి.

వార్డులు 27 ఏకగ్రీవం...

మండలంలోని 32 గ్రామపంచాయతీల్లో27 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి.అజయ్‌తండాలో4, అనాసాగరం, బోదులబండ2, బుద్దారం,కట్టుకాసారం6,కోరట్లగూడెం 2, సదాశివపురం3, ఆచార్లగూడెం 8 ఏకగ్రీవం అయ్యాయి.



రేగులచలక ఏకగ్రీవ సర్పంచ్ రమాదేవిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు వెంకటరమణ, ప్రసన్న కృష్ణ

కాంట్రాక్టర్ నామినేషన్ రద్దు చేయండి
ఎన్నికల ఆర్‌ఓకు ఫిర్యాదు చేసిన సీపీఐ అభ్యర్థి

ఖమ్మంరూరల్: మండల పరిధిలోని కస్నాతండా గ్రామంలో సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కాంట్రాక్టర్ బానోతు పాపనాయక్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని సీపీఐ తరుపున సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న అజ్మీరా రాంమూర్తి నాయక్ బుధవారం ఎన్నికల ఆర్‌ఓకు ఫిర్యాదు చేశారు. క్లాస్ టూకాంట్రాక్ట్ పనులు చేస్తూ ఎన్నికలకు పోటీ చేస్తున్నట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు.

108మంది సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్

కామేపల్లి: కామేపల్లి మండల పరిధిలోని 24 గ్రామ పంచాయితీలో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్‌ల స్వీకరణ మంగళవారంతో ముగిసింది.108 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు,వార్డు సభ్యులు 514మంది నామినేషన్‌వేశారు.ఈ క్రమంలో ఊట్కూర్‌లో, పాతలింగాలలో మాత్రమే సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా కామేపల్లి ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

ఐదు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం

రఘునాథపాలెం: మండలంలో 37 పంచాయతీలకుగానూ ఐదుపంచాయితీలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 32పంచాయతీలకు ఈనెల 11న ఎన్నికలు జరగనున్నాయి. బరిలో నిలిచిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు బుధవారం గుర్తులను సైతం కేటాయించారు. కాగా ఎన్నికలు జరిగే మొత్తం 32పంచాయతీలకు గానూ మొత్తం. మందిసర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఉపసంహరణల అనంతరం ఐదు గ్రామ పంచాయతీల నుంచి సర్పంచ్ స్థానానికి ఒకే ఒక నామినేషన్ ఉండటంతో ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. కాగా రఘునాథపాలెం పంచాయతీకి గాజుల కృష్ణారావు, రేగులచలక గ్రామానికి యండపల్లి రమాదేవి, రాములుతండా పంచాయతీకి బానోతు వెంకట్రామ్, మల్లేపల్లికి తేజావత్ బద్రి, మంగ్యాతండాకు మాలోతు భార్గవి ఏకగ్రీవంగా సర్పంచ్లుగా ఎన్నికయ్యారు. సీఐ యండీ ఉస్మాన్ షరీఫ్, ఎస్సై జీ నరేశ్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కోయచలక పంచాయితీ ఏకగ్రీవం కావాల్సి ఉన్నప్పటికీ అధికార పార్టీకి చెందిన ఒక వార్డు సభ్యుడు అందుబాటులో లేని కారణంగా నిలిచిపోయింది. ఏకగ్రీవ ఒప్పందానికి అధికార పార్టీ కట్టుబడి ఉండకపోవడంతో బీఆర్ఎస్ పార్టీ నేతలు ఎన్నికలకు వెళ్తామంటూ కేంద్రం నుంచి నిష్క్రమించారు. దీంతో అక్కడ ఎలక్షన్ అనివార్యమైంది. మండల పరిధిలో మరికొన్ని పంచాయితీలు ఏకగ్రీవంగా కాంగ్రెస్ ఖాతాలోకి వచ్చే అవకాశంఉన్నా రాకుండా కొందరు కాంగ్రెస్ నాయకులే అడ్డుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

తుమ్మల కృషితో రేగులచలక సర్పంచ్ ఏకగ్రీవం

రఘునాథపాలెం: మండల పరిధిలోని రేగులచలక పంచాయితీ ఎన్నికలో యండపల్లి రమాదేవిని ఏకగ్రీవం కావటంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి ఎంతో ఉందని రేగులచలక గ్రామ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కన్నం ప్రసన్న కృష్ణ, కోయచలక గ్రామ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పాలెపు వెంకటరమణ, కోయచెలక ఎంపీటీసీ పరిధి ఇన్‌చార్జ్ ఎర్రం బాలగంగాధర్ తిలక్ అన్నారు. బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికైన రమాదేవిని, వార్డుసభ్యులను ఘనంగా సన్మానించారు. రానున్న రోజులలో గ్రామాభివృద్ధికి పార్టీ పటిష్టతకు తోడ్పాటు అందించాలని సూచించారు.సర్పంచ్, వార్డుసభ్యులకు, సహకరించిన ప్రజలకు మంత్రితుమ్మల నాగేశ్వరరావు, యువనాయకులు తుమ్మల యుగంధర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రావూరి సైదుబాబు, గుత్తా వెంకటేశ్వరరావు, చంద్రా రాంబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో యండపల్లి సత్యం, గ్రామకాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

50వసంతాల అపూర్వ కలయిక
నగరంలో కలుసుకున్న బనిగండ్లపాడు జూనియర్ కళాశాల పూర్వవిద్యార్థులు



ఖమ్మంబైపాస్‌రోడ్డు, డిసెంబరు3:(ఆంధ్రజ్యోతి): 1974-1976లో ఎర్రుపాలెం మండలంలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసిన వారంతా బుధవారం ఆనందోత్సాహాలతో కలుసుకున్నారు. ఖమ్మంలో ఓ ప్రైవేటు హోటల్‌లో జరిగిన ఈకార్యక్రమంలో సుమారు 60మంది కలుసుకున్నారు. 50ఏళ్ల తరువాత కలుసుకోవటంతో నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. వారంతా దేశ,విదేశాల్లో స్థిరపడ్డారు. నెలరోజులుగా ఈ వేడుక నిర్వహించేందుకు కష్టపడ్డారు. ఈ నేపథ్యంలో బుధవారం ఖమ్మంలో కలుసుకున్నారు. అప్పటి లెక్చరర్స్ సత్యనారాయణ, శర్మా, ప్రకాష్‌రావును సన్మానించారు.

రూ. 81లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మంలీగల్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): రఘునాథపాలెం మండలం రామకియా తండాకు చెందిన గుగులోతు చంటి ఖమ్మం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.81లక్షల36వేలకు దివాళా పిటీషన్ దాఖలు చేశాడు. ఆయన పురుగుమందుల వ్యాపార అభివృద్ధి కోసం మొత్తం 19 మంది రుణదాతల వద్ద వ్యాపార అభివృద్ధికి అధిక వడ్డీలకు రుణాలు తీసుకున్నాడు. వ్యాపారంలో నష్టాలు రావటంతో, రుణదాతల ఒత్తిడి అధికమవడంతో తన న్యాయవాది ద్వారా కోర్టులో ఐపీ దాఖలు చేశారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలని ప్రముఖ వైద్యులు కేవీ కృష్ణారావు అన్నారు. బుధవారం టేకులపల్లి గురుకుల పాఠశాలలో న్యూలక్ష్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పిల్లల ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.సునిత, వైస్‌ప్రిన్సిపాల్ ఏ.రీనాధారీదేవి, డి.స్వప్న లత, కె.శైలజ, దొడ్డ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతి

తిరుమలాయపాలెం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): బీరోలుగ్రామానికి చెందిన టీడీపీ నేత గన్నారపు శ్రీనివాస్(60) బుధవారం అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. శ్రీనివాస్ పార్టీ ఆవిర్భావం నుంచి చురుకైన పాత్ర పోషించారు. కాగా ఆయన భౌతికకాయాన్ని పార్టీ జిల్లానాయకులు కొండల కరుణాకర్, నామాప్రసాద్, మల్లెంపాటి లహరిన్, కాంగ్రెస్ నాయకులు కొప్పుల రాంరెడ్డి, జాన్‌బాబు నివాళులర్పించారు.

పొగమంచులో ప్రయాణం ప్రమాదకరం
సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): దట్టమైన పొగమంచు సమయంలో వాహన ప్రయాణం ప్రమాదకమని సీపీ సునిల్‌దత్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. బుధవారం తెల్లవారుజామున సత్తుపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారని, పొంగమంచు కారణంగా జరుగుతున్న రోడ్డుప్రమాదాలు దృష్టిలో పెట్టుకుని నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందన్నారు.

హిందువులకు సీఎం క్షమాపణ చెప్పాలి
బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు

ఖమ్మంక్రైం, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): హిందూదేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. నగరంలోని జడ్పీసెంటర్‌లో బుధవారం రాత్రి నిరసన కార్యక్రమం చేపట్టారు. హిందువులను అవమానిస్తే సహించేది లేదని, రాబోయే రోజుల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజల గద్దె దించునున్నారని అన్నారు. హిందూ సమాజం మొత్తం ముఖ్యమంత్రిపై తిరగబడేరోజు త్వరలోనే వస్తుందన్నారు. నిరసన తెలుపుతున్న నేతలను పోలీసులు అడ్డుకున్నారు. పలువురిని అరెస్టు చేసి టూటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు,నల్లగట్టు ప్రవీణ్ కుమార్,మందార సుబ్బారావు, అల్లిక అంజయ్య,వీరెల్లి రాజేష్,రవి రాథోడ్, దొడ్డ అరుణ, రజనీరెడ్డి, మంద సరస్వతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

సేవాలోపంపై జరిమానా

ఖమ్మంలీగల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): విమాన సంస్థ సేవాలోపంపై ఫిర్యాదుదారుడికి రూ.2లక్షలతో పాటు రూ.10వేల నష్టపరిహారం కింద చెల్లించాలని వినియోగదారుల ఫోరంకమిషన్ మెంబర్ వి.లలిత, ఎ.మాధవిలత బుధవారం తీర్పు చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురానికి చెందిన కె.ఎస్.ఎస్.సాగర్‌బాబు దంపతులు అమెరికా వెళుతున్నారు. ఈనేపథ్యంలో లగేజ్ చార్జీలకుగాను రూ.24వేలు చెల్లించారు. ప్రయాణంలో భాగంగా 2024లో ప్యారిస్‌కు చేరుకున్నారు. అక్కడ ఎయిర్‌లైన్స్ అథారిటీ వారు లగేజీ చార్జీలు చెల్లించాలని కోరారు. చార్జీలు మొత్తం హైదరాబాద్‌లో చెల్లించినప్పటికీ అక్కడ ఇండిగో ఎయిర్‌లైన్స్ వాళ్లు ప్యారిస్ ఎయిర్‌లైన్స్ వాళ్లకి ఎటువంటి చెల్లింపు రసీదు పంపలేదు. దీంతో ఆయన అక్కడ అధికారులు అడిగిన మొత్తాన్ని చెల్లించాడు. లగేజీ కూడా కనిపించకపోవటంతో ఇండిగో ఎయిర్‌లైన్స్ వారి సేవాలోపంపై వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశాడు. జిల్లా కమిషన్ కేసుపూర్వాపరాలు పరిశీలించి పైవిధంగా తీర్పు చెప్పారు.

శ్రీకాంతాచారికి ఘన నివాళి

ఖమ్మంచర్చికాంపౌండ్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆత్మార్పణం చేసిన శ్రీకాంతాచారి వర్ధంతిని బుధవారం ఖమ్మంనగరంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని అమరవీరుల స్తూపం వద్ద శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తొలి, మలిదశ ఉద్యమాల ద్వారానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణజనసమితి రాష్ట్ర కార్యదర్శి గోపగాని శంకరరావు, టీజేఎస్‌జిల్లానాయకుడు బటగ్గు రాజేందర్, మాదాసు శ్రీనివాసరావు, పట్టణనాయకులు గడ్డం వెంకటరెడ్డి, బెల్లంకొండ నాగేశ్వరరావు, పగడాల నరేదర్, కొమరశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమమే ధ్యేయం

- టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్



మాట్లాడుతున్న అశోక్‌గౌడ్

ఖమ్మంలీగల్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల సంక్షేమమే ధ్యేయమని, న్యాయవాదులకు రక్షణ, అభివృద్ధి, సౌకర్యాల కల్పనకోసం తన ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉన్నదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్‌సెల్‌చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లాకోర్టులో బార్ కౌన్సిల్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని న్యాయవాదులను ఉద్దేశించి మాట్లాడారు. న్యాయవాదులపై తరచూ జరుగుతున్న దాడుల నేపథ్యంలో న్యాయవాద రక్షణ చట్టాన్ని బలంగా తీసుకురావటానికి, నెలసరి స్టైఫండ్ అందించే విధానంతో పాటు పలు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. బార్ కౌన్సిల్ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు.ఈకార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, కార్యదర్శి గద్దల దిలీప్‌కుమార్, ఉపాధ్యక్షురాలు విజయశాంత, టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ సింగం జనార్ధన్, జాయింట్ కన్వీనర్లు కెవీవీ.లక్ష్మి, ఆవుల అనురాధ,పి.దానయ్య, ఆకుల శేఖర్, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుండా విజయోత్సవాలు ఎందుకు ?
ఎమ్మెల్సీ మధుసూదన్



మాట్లాడుతున్న మధుసూదన్‌రావు

ఖమ్మంమార్కెట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గు చేటని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌రావు విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంగళవారం భద్రాద్రి పర్యటనలో ముఖ్యమంత్రే స్వయంగా ఎన్నికల కోడ్‌ను దర్జాగా ఉల్లంఘించారన్నారు.మీటింగ్‌లో తమ పార్టీ అభ్యర్థులకు ఓటేయమని బహిరంగంగా కోరడం ఎన్నికల నియమావళికి విరుద్ధమని అన్నారు. మన్మోహన్‌సింగ్ ఎర్త్ యూనివర్శిటీ ప్రారంభానికి వచ్చి ఆ వేదికను రాజకీయంగా ప్రచార వేదికగా వాడుకుందని ఎద్దేవా చేశారు. మీటింగ్ ఆద్యంతం మాజీప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు పలక కుండా ఆయన సేవలను ప్రస్తావించకుండా అవమానించారని అన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ అమరుడు దాసోజు శ్రీకాంతా చారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, డీసీసీబీ మాజీచైర్మన్ కూరాకుల నాగభూషణం, కర్నాటి క్రిష్ణ, నాయకులు బిచ్చాల తిరుమలరావు, మక్బూల్, బొమ్మెర రామ్మూర్తి, ఉప్పల వెంకటరమణ, తాజుద్దీన్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలుదాం
డీఎంహెచ్‌వో రామారావు



ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతికపరంగా ఎదిగేలా ప్రోత్సహిద్దామని..వారికి తోడుగా,అండగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ డి రామారావు కోరారు. బుధవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పాతమునిసిపల్ కార్యాలయంలో ప్రత్యేక మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. క్యాన్సర్,హైపర్ టెన్షన్, మధుమేహం,అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ కార్యక్రమాలు ఏర్పాటు చేసి దివ్యాంగుల ఆరోగ్యం పట్ల సేవలను అందించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్లు కృష్ణ చైతన్య, సాయి కుమార్, ఏఎన్ఎం దయమణి, డీఈవో నాగలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ.. పది మందిపై కేసు

ఖమ్మంక్రైం, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమి ఆక్రమించిన పదిమందిపై ఖానాపురం హవేలి పోలీస్ స్టేషన్‌లో బుధవారంరాత్రి కేసు నమోదు అయింది. మల్లెమడుగు రెవెన్యూ పరిధిలోని ఓ ప్రభుత్వ భూమిపై కొంతకాలంగా వివాదం జరుగుతుంది. దీనిపై ఖమ్మంఅర్బన్ తహశీల్దార్ డి.సైదులు ఖానాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈఫిర్యాదు మేరకు నగరానికి చెందిన వెంకట నరసయ్య, నాగమణి,శ్రీనివాసరావు, సాయిరాం సూర్య, సత్యంబాబు, ధనలక్ష్మి, శాంసన్, రఘు, కల్పన, సునీల్‌పై కేసు నమోదు చేశారు.

ప్రభుత్వ చేయూతతో ఆర్థికంగా ఎదగాలి

- కేఎంసీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్
- ఘనంగా ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం





మెప్మా, కేఎంసీ అధికారులు ఆధ్వర్యంలో వేడుకలు

ఖమ్మంకార్పొరేషన్,డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే చేయూతతో దివ్యాంగులు ఆర్థికంగా ఎదగాలని ఖమ్మం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, మెప్మా జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ సావల సుజాత పేర్కొన్నారు. బుధవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో టీఎంసీ గుడిపూడి సుజాతరాణి ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు చైతన్య సిబ్బందితో కలిసి వైద్యశిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి మందులు, ఉచిత పరీక్షలు చేపట్టారు. ఆదర్శవంతంగా జీరాక్స్ సెంటర్‌ను నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న దివ్యాంగుడు వీరబాబును సన్మానించారు. దివ్యాంగుల స్వయం సహాయకసంఘం సభ్యులకు బ్యాంకు లింకేజీ రుణాలను అందించారు. ప్రధాన మంత్రి స్వనిధి రుణాలకు ఆన్‌లైన్ నమోదు చేశారు. మహాత్మాగాంధీ ఫెడరేషన్ అధ్యక్షురాలుజ్యోతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఎస్‌కేసల్మా,జీ.ఉపేంద్ర, చిలకా ద్రౌపది, సిబ్బంది రాయల నాగేశ్వరరావు,సంధ్య,ఆర్పీల సంఘం అధ్యక్షురాలు ఎస్‌కే సబిహా అంజుం పాల్గొన్నారు.

అధికారిక కార్యక్రమానికి అతీతంగా

కేఎంసీ కార్యాలయంలో మేయర్, కమిషనర్ సూచనల మేరకు మెప్మా ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల కార్యక్రమం నిర్వహించగా ఆ కార్యక్రమానికి కార్యాలయంలోని దివ్యాంగులైన ఉద్యోగులు గైరాజరయ్యారు. కేఎంసీ కార్యాలయంలోనే పోటా పోటీగా అధికారిక కార్యక్రమానికి అతీతంగా మరో కార్యక్రమం నిర్వహించారు. కేఎంసీలోని ఎస్‌ఈ రంజిత్ ఇతర అధికారులతో కేక్‌కటింగ్ చేసి దివ్యాంగులైన ఉద్యోగులతో కలిసి కార్యక్రమం చేశారు.ఒకేకార్యాలయంలో పోటా పోటీగా అధికారులు, ఉద్యోగులు కార్యక్రమాలు చేయటంపై దివ్యాంగుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి.

దివ్యాంగులకు చేయూతనివ్వండి
తహసీల్దార్ వెంకటేశ్వర్లు

నేలకొండపల్లి: దివ్యాంగులను చులకన చేయొద్దని, అవసరమైన చేయూతను అందించాలని తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు కోరారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నేలకొండపల్లి, రాజేశ్వరపురం గ్రామాల్లో పలు కార్యక్రమాలను నిర్వహించారు. రాజేశ్వరపురంలోని భవితా సెంటర్లో దివ్యాంగ పిల్లలకు ఆటలపోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి బాలిన చలపతిరావు, ఉపాధ్యాయులుపాల్గొన్నారు.నేలకొండపల్లిలో రూ.50 వేల విలువైన బ్యాటరీతో నడిచే త్రీవీలర్‌కు లాటరీ తీశారు. లాటరీలో వచ్చిన మామిడి కొండలరావు అనే దివ్యాంగునికి త్రీవీలర్‌ను అందచేశారు.అక్కినేని గోపాలకృష్ణయ్య మామిడితోటలో సహపంక్తి భోజనాలు చేశారు. సంఘంజేఏసీచైర్మన్‌ను సత్కరించారు. కార్యక్రమంలోగడిపూడి భాస్కరరావు, డేగల వేణు,ఇస్లావత్ రామారావు, కొరివీరన్న, మీరా తదితరులు పాల్గొన్నారు. సీపీఐ జిల్లా నాయకుడు కర్నాటి భానుప్రసాద్,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుపాల్గొన్నారు.

కామేపల్లి: కామేపల్లి మండలంలోని కొత్తలింగాల గ్రామంలో భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం ఘనంగా బుధవారం నిర్వహించారు. ఆటలపోటీల్లో విజేతలైన చిన్నారులకు మండల స్పెషల్ ఆఫీసర్ మదుసుదన్, తహసీల్దార్ సుధాకర్ బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారి జీ. వెంకట్, అనిత, శివ, అరుణ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకుసాగాలని తహసీల్దార్ లూథర్ విల్సన్ తెలిపారు. బుధవారం మండలంలోని పిండిప్రోలులో దివ్యాంగుల దినోత్సవాలు జరిపారు. క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.ఈకార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, హెచ్‌ఎంలు బాబులాల్, వసంత రాణి, పాల్గొన్నారు.





రాజేశ్వరపురంలో బహుమతులను అందజేస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు, పిండిప్రోలులో..

సాయి స్వాముల అన్నదానం



పెనుబల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పెనుబల్లి పరిసర గ్రామాలకు చెందిన సాయిస్వాములు షిర్డీలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెనుబల్లి నుంచి కొన్నేళ్లుగా సాయిస్వాములు దత్తజయంతిని పురస్కరించుకొని షిర్డీకి వెళ్తుంటారు. అలా వెళ్లిన స్వాములు షిర్డీలో దత్తసాయిని దర్శించుకొని పెనుబల్లికి చెందిన బెజవాడ వెంకటరామారావు(చంటి), బయ్యన్నగూడెంకు చెందిన నాగులు శ్రీను అన్నదానాన్ని నిర్వహించారు. షిర్డీసాయిపీఠం స్వాములు బొర్రా శ్రీను, శీలం రామారావు, ఆవుల శ్రీను, మాజీ సర్పంచ్ తావునాయక్, సొసైటీ డైరెక్టర్ బొర్రా వెంకటేశ్వర్లు, వంగా చెన్నారావుతోపాటు మహిళలు పాల్గొన్నారు.

పంచాయతీల ఏకగ్రీవం.. పల్లెల్లో సంబరం..

ఎర్రుపాలెం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల నేపథ్యంలో మండలంలో 6 పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవం చేసుకుంది. తుళ్లూరు నిర్మలకుమారి(జమలాపురం), షేక్ ఫాతిమా(కాచవరం), బబండ్ల రాణి (గట్లగౌరారం), వేమిరెడ్డి పరమేశ్వరి(రామన్నపాలెం), భూక్యా రాము(కండ్రిక), బొగ్గుల శ్రీనివాసరెడ్డి (చొప్పకట్లపాలెం) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ధృవీకరించారు.

మధిరరూరల్: మండలంలో రెండు గ్రామపంచాయతీలు ఏకగ్రీమయ్యాయి. ఎస్సీ మహిళకు రిజర్వు అయిన సిద్దినేనిగూడెం(మర్లపాడు) సర్పంచ్‌గా కాంగ్రెస్ అభ్యర్థి వేల్పుల వెంకట్రావమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే బీసీ మహిళకు రిజర్వు అయిన సైదిల్లీపురం సర్పంచ్‌గా కాంగ్రెస్ అభ్యర్థి నెల్లూరి ధనలక్ష్మీ ఏకగ్రీవం అయ్యారు.

చింతకాని: మండలంలోని రాఘవాపురం గ్రామ పంచాయతీ వరుసగా రెండవ సారి ఏకగ్రీవమైంది. ఎస్సీ మహిళకు రిజర్వ్ కాగా సీపీఐ అభ్యర్థి కాంపెల్లి కోటమ్మ గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవమయ్యారు.

వైరా: మండలంలోని నారపనేనిపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా కాంగ్రెస్‌కు చెందిన శీలం చంద్రశేఖరరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వార్డు సభ్యులుగా గుడిద కోటేశ్వరి, తడికమళ్ల మాధవి, మాడపాటి చంద్రయ్య, శీలం విజయకుమారి, మడుపల్లి వెంకటేశ్వర్లు, కనకపూడి ప్రసాద్, శీలం వెంకన్న, షేకుల శాంతమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



ఏకగ్రీవంగా ఎన్నికైన చంద్రశేఖర్‌రెడ్డి

దివ్యాంగులకు మరిన్ని సేవలు

» సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలోని సిద్దారం రోడ్‌లోని స్వర్ణిక దివ్యాంగుల సేవా ఆశ్రమంలో నిర్వహించిన వేడుకలలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగుల నడుమ కేక్ కట్‌చేసి మిఠాయిలు తినిపించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత బస్‌పాస్‌లను దివ్యాంగులకు ఎమ్మెల్యే చేతులమీదుగా అందించారు. అంతకముందు దివ్యాంగుల సేవాఆశ్రమం నిర్వాహకులు వలపర్ల రవికుమార్‌ను సన్మానించారు.

కార్మికులకు యూనిఫామ్ పంపిణీ

సత్తుపల్లి మునిసిపాలిటీలో పనిచేస్తున్న 128మంది పారిశుద్య కార్మికులు, ఎన్ఎంఆర్, వాటర్ సప్లయ్, బిల్ కలెక్టర్లు, స్ట్రీట్ లైట్ సిబ్బందికి రూ.5లక్షల విలువైన రెండు జతల యూనిఫామ్‌ను ఆమె చేతులమీదుగా పంపిణీ చేశారు. అదేవిధంగా రూ.38లక్షలతో కొనుగోలు చేసిన వాహనంతో పాటు డంపర్‌బిన్లను ప్రారంభించారు. కమిషనర్ నర్సింహ పాల్గొన్నారు.

భవితలో సౌకర్యాలను వినియోగించుకోవాలి

కొణిజర్ల: మండల కేంద్రమైన కొణిజర్లలోని భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో వర్ష, ఎంఈవో అబ్రహం హాజరయ్యారు. భవిత కేంద్రంలో విద్యార్థుల కోసం అనేక సౌకర్యాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ఆమె సూచించారు. సిబ్బంది పవన్, సుగున, వాణి, పాల్గొన్నారు.

ఏన్కూరు: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐఆర్పీ స్పెషల్ ఎడ్యుకేటర్స్ రవికిరణ్, అరుణ్, ఐఆర్పీ సాంబయ్య, రాఘవరావు పాల్గొన్నారు.

పెనుబల్లి: మండలంలోని భవిత కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులుపంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. దివ్యాంగుల సేవల పట్ల తల్లిదండ్రుల పాత్ర వెలకట్టలేనిదని, పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, ప్రత్యేక ఉపాధ్యాయులు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. భవిత కేంద్రంలో ఫిజియోథెరపీతోపాటు పరికరాలను ఉపయోగించుకోవాలన్నారు. ఎంఈవో ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు మురళీకృష్ణ, మంజుల, నజియా, హెచ్ఎం రాజు, సీఆర్‌పీలు, పిల్లలు, ఉపాధ్యాయురాలు సురేఖ పాల్గొన్నారు.

వైరా: దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం వైరాలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా సమగ్ర శిక్ష సీఎంవో ప్రవీణ్‌కుమార్ దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు నిర్వహించిన ఆటల పోటీల్లోని విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. డాక్టర్ శ్వేత సహాయ సహకారాలతో దివ్యాంగ బాలికలకు శానిటరీ నాప్‌కీన్స్ అందజేశారు. వైరా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జి. మాధవరావు, వైరా బాలికల, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మల్లీశ్వరి, ఎన్. స్వప్న, ఫిజియోథెరపిస్టు జి.వసంత, ప్రత్యేక ఉపాధ్యాయులు శ్రావణి, రవికుమార్, అజిత పాల్గొన్నారు.



సత్తుపల్లిలోదివ్యాంగులకు బస్‌పాస్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి



బహుమతులిస్తున్న తహసీల్దార్, ఎంఈవో



దివ్యాంగుల దనోత్సవం సందర్భంగా బహుమతులను అందజేస్తున్న ఎంపీడీవో



ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

ద్రవరూప నానో డీఏపీ ఎంతో ఉపయోగం

» జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య



తనికెళ్లలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఏవో పుల్లయ్య

కొణిజర్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ద్రవరూప నానో డీఏపీ మొక్కజొన్న రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య తెలిపారు. మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సలహాలు ఇస్తూ మొక్కజొన్న సాగు చేసిన 25 రోజుల తర్వాత 15 రోజులకు ఒకసారి నానోయూరియాను పిచికారి చేయాలని సూచించారు. ద్రవరూపంలో ఉన్న డీఏపీ ఆకుల మీద బాగా పడే పిచికారి చేయటం వల్ల మందు ఆకుల లోపలకు వెళ్తుందని, దాంతో మందు వృథాకాదని తెలిపారు. నానో డీఏపీని గాని యూరియాని గాని సాయంత్రం సమయంలో పిచికారి చేసకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి బాలాజి, ఆఫీస్ టెక్నికల్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

50వసంతాల అపురూప కలయిక

ఖమ్మంలో కలుసుకున్న బనిగండ్లపాడు జూనియర్ కళాశాల పూర్వవిద్యార్థులు

ఖమ్మం బైపాస్‌రోడ్డు,డిసెంబరు3:(ఆంధ్రజ్యోతి): 1974-1976లో ఎర్రుపాలెం మండలంలోని బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తిచేసిన వారంతా బుధవారం ఆనందోత్సాహాలతో కలుసుకున్నారు. ఖమ్మంలో ఓప్రైవేటు హోటళ్లల్లో జరిగిన ఈకార్యక్రమంలో సుమారు 60మంది కలుసుకున్నారు. 50ఏళ్ల తరువాత కలుసుకోవటంతో నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. వారతంతో దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. నెల రోజులుగా ఈ వేడుక నిర్వహించేందుకు కష్టపడ్డారతీ నేపథ్యంలో బుధవారం ఖమ్మంలో కలుసుకున్నారు. అప్పటి లెక్చరర్స్, సత్యనారాయణ, శర్మా, ప్రకాష్‌రావును సన్మానించారు.



గడువు దాటితే నామినేషన్లు తీసుకోవొద్దు



కిష్టారంలో పంచాయితీ కార్యాలయాన్ని సందర్శించిన శ్రీజ

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే నామినేషన్లు తీసుకోవద్దని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.శ్రీజ ఆదేశించారు. సత్తుపల్లి మండలంలో 3వ విడత సర్పంచి ఎన్నికల ఏర్పాట్లను బుధవారం ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం నామినేషన్లను దాఖలు చేసే క్లస్టర్ కేంద్రం మండలంలోని కిష్టారం గ్రామం పంచాయితీ కార్యాలయాన్ని సందర్శించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కేంద్రాల్లో తగిన వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ వేసేందుకు కేంద్రం వద్దకు వచ్చిన అభ్యర్థులకు నామినేషన్ల దాఖలులో సందేహాలు నివృత్తి చేయాలని అధికారులకు ఆమె సూచించారు. అదేవిధంగా సిద్దారం క్లస్టర్‌ను కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, కొత్తూరు క్లస్టర్‌ను డీపీఓ ఆశాలత, డీఎల్‌పీఓ విజయలక్ష్మీలు సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.

కారేపల్లి: మండలంలో మూడవ విడద జరుగుతన్న పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం నుంచి ప్రారంభమైనా నామినేషన్ల ప్రక్రియను జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దీక్షరైనా పరిశీలించారు. బాగ్యనగర్‌తండా, సీతారాంపురం, కోమట్లగూడెం, సింగరేణి పంచాయతీ కార్యాలయాలను ఆమె సందర్శించి ఎన్నికల రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో నామినేషన్ల ప్రక్రియా ఎలా జరుగుతుందని తెలుసుకుని, వారికి కొన్ని సలహా సూచనలు చేశారు. సీఈవో వెంట ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్, ఎస్ఐ బైరు గోపి ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మధిర: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమవళిని ఖచ్చితంగా పాటించాలని మధిర తహసీల్దార్ రాంబాబు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సీఐలు మధు, రమేష్ లు తెలిపారు. బుధవారం సాయంత్రం మధిర తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మండలంలో 25 సర్పంచ్‌లకు, 202 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు. ఈ నెల 11న మండలం లో పోలింగ్ జరగనుండడంతో 9వ తేది సాయంత్రం వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించుకోవొచ్చని మైక్ పర్మిషన్ కోసం తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే దానిని పోలీస్ వారికి తగు పరిశీలనకు పంపి వారి నుంచి నిరభ్యంతరం వచ్చిన తరువాతే పర్మిషన్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. మైకు పర్మిషన్‌కు రోజుకు వంద రూపాయల చొప్పున మీసేవలో చెల్లించాలని, పర్మిషన్ వచ్చిన తరువాత ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకే పర్మిషన్ తీసుకున్న గ్రామ పంచాయతీలో మాత్రమే మైకు వినియోగించాలని, సర్పంచ్ అభ్యర్థికి మాత్రమే పర్మిషన్ ఇవ్వడం జరుగుతుందని తెలపారు. డోర్ టూ డోర్ ప్రచారం మాత్రం ఉదయం 6గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించుకోవచ్చని ర్యాలీలు, రోడ్‌షోలకు ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ రోజు పోలింగ్ కేంద్రాల వద్ద బిఎన్ఎస్ 136 సెక్షన్ అమల్లో ఉంటుందని వంద మీటర్ల అవతలే ఉండాలని ఫలితాల అనంతరం ర్యాలీలు నిషేధించడం జరిగిందన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పై చేయి



నామినేషన్ పక్రియలో శ్రేణులతో మట్టా దయానంద్

కల్లూరు, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి) స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచు సీట్లను ఎక్కువ స్థానాల్లో విజయం సాధించి పై చేయిగా నిలుస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్ అన్నారు. మండలంలోని చంద్రుపట్ల గ్రామంలో బుధవారం కాంగ్రెస్ తరుపున సర్పంచు అభ్యర్థిగా బండి వాణి నామినేషన్ ప్రక్రియకు హాజరైన సందర్భంగా ఆయన కాంగ్రెస్ శ్రేణులకు ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఆయుధంగా తీసుకొని విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను కలుసుకోవాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యాలను కూడా ప్రజలకు వివరించాలని కోరారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు 80 శాతం పైగా విజయం సాధిస్తారని అన్నారు. చంద్రుపట్లలో కాంగ్రెస్ సర్పంచు అభ్యర్థి బండి వాణిని ఈ సందర్భంగా బెస్ట్‌ఆఫ్ లాక్ చెప్పారు. ఈ సందర్భంగా పలు గ్రామాల సర్పంచు అభ్యర్థులకు, పార్టీ శ్రేణులకు గెలుపు అవకాశాలపై దయానంద్ దిశానిర్ధేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లింగబోయిన పుల్లారావు, కుక్క వేలాద్రి, మాజీ ఎంపీటీసీ నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ పదవికి అభ్యర్థుల పోటాపోటీ

వైరా, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో ఈనెల 11న జరుగనున్న 18గ్రామపంచాయతీ సర్పంచ్ పదవులకు 50మంది, 156వార్డులకు 360మంది బరిలో నిలిచారు. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను బుధవారం రాత్రి 9.30గంటలకు అధికారులు ప్రకటించారు. మండలంలో 22గ్రామపంచాయతీలు ఉండగా స్నానాల లక్ష్మీపురంలో నూతి వెంకటేశ్వరరావు, పుణ్యపురంలో యంగల మరియమ్మ, నారపనేనిపల్లిలో శీలం చంద్రశేఖరరెడ్డి, గోవిందాపురంలో రంగిశెట్టి కళావతి సర్పంచ్ పదవులకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 200వార్డులకుగానూ 44వార్డులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 18 పంచాయతీ సర్పంచ్ పదవులకు 50మంది, 156వార్డులకు 360మంది పోటీలో ఉన్నారు.

కొణిజర్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు గాను సర్పంచ్ పదవికి 194 మంది నామినేషన్ వేశారు. 254 వార్డులకు గాను 634 మంది అభ్యర్థులు నామినేషన్ వేశారు. 194 మందిలో ఎన్నికల సిబ్బంది పరిశీలన, బుధవారం జరిగిన ఉపసంహరణలో 121 మంది అభ్యర్థులు పోగా 73 బంది బరిలో ఉన్నారు. మండలంలోని 27 గ్రామ పంచాయతీలకు గాను 73 మంది పోటీలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వార్డులకు మండలంలోని 254 వార్డులకు 524 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సొసైటీ మాజీ చైర్మన్

బోనకల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బోనకల్ గ్రామానికి చెందిన సొసైటీ మాజీ చైర్మన్ యార్లగడ్డ చిన నర్సింహా బుధవారం డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. గతంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పని చేసిన ఆయన మారిన రాజకీయ పరిణామాల నడుమ బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. పార్టీ అధికారంలోకి రావడంతోపాటు పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నర్సింహా సొంత గూటికి చేరారు. కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పైడిపల్లి కిషోర్ కుమార్, మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, సొసైటీ చైర్మన్ చావా వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ పోటు వెంకటేశ్వర్లు, మోర్ల మహేశ్వరరావు, యార్లగడ్డ కృష్ణయ్య, కోటేశ్వరరావులు పాల్గొన్నారు.

రామాలయంలో సామూహిక హనుమత్ వ్రతాలు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణంలో వేంచేసియున్న శ్రీ గీతాజ్ఞాన మందిరంతో పాటు శ్రీ కోదండ రామాలయంలో బుధవారం భక్తులు సామూహిక హనుమత్ వ్రతాలు, ప్రత్యేక పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయగా అభిషేకాలు జరిపించ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఆలయంలో పూజలు చేస్తున్న మహిళ భక్తులు

కొణిజర్ల పాఠశాలను సందర్శించిన డీఈవో

కొణిజర్ల,డిసెంబరు3(ఆంధజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారి చైతన్యజైని బుధవారం మండల కేంద్రమైన కొణిజర్లలోని ప్రాథమిక పాఠశాలను, భవిత కేంద్రాన్ని, ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యా, వసతులను పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగదుల గదుల పరిశుభ్రత, ఈసీఆర్ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మెరుగైన విద్యా విధానాలతో పాఠశాలల నాణ్యతను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి అబ్రహం, ఏఎంవో ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొణిజర్లలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో చైతన్యజైని

స్వచ్ఛతలో మార్గదర్శకం మల్లారం పాఠశాల

తల్లాడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతలో ఖమ్మం జిల్లాలోని తల్లాడ మండలం మల్లారం ప్రాథమిక పాఠశాల మరోసారి సత్తా చాటి జిల్లాకే ఆదర్శంగా నిలిచింది. స్వచ్ఛ హరిత విద్యాలయాల, ఎంపికలో జిల్లాలో ప్రాథమిక పాఠశాలల విభాగంలో మల్లారం ప్రాథమిక పాఠశాల ప్రథమస్థానం సాధించింది. గతంలో మల్లారంప్రాథమిక పాఠశాలకు మూడుసార్లు జిల్లాస్థాయిలో స్వచ్ఛ హరిత విద్యాలయ పురస్కారాలు దక్కాయి. హెచ్ఎం బి. హరిబాబు , ఉపాధ్యాయులు కృషి, పాఠశాల దత్తత స్వీకర్త దుగ్గిదేవర శ్రీరఘునందన్ సహకారంతో పాఠశాలకు నాలుగోసారి స్వచ్ఛ హరిత విద్యాలయ పురస్కారం లభించింది. 2016లో పాఠశాలను శ్రీరఘునందన్ దత్తత తీసుకుని పాఠశాలలో పరిశుభ్రత, మొక్కలు సంరక్షణ కోసం తనవంతు సహకారాన్ని అందించాడు. పాఠశాలలో పనిచేసిన హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సమిష్టి కృషితో పాఠశాలకు 2016-17, 2017-18, 2021-22లో మూడుసార్లు జిల్లా స్థాయి, 2016-17, 2021-2022లో రెండు సార్లు రాష్ట్రస్థాయి, 2016-17లో జాతీయస్థాయి స్వచ్ఛ హరిత విద్యాలయ పురస్కారాలు వరించాయి. నాలుగోసారి కూడా ఈ పురస్కారాన్ని హెచ్ఎం బి.హరిబాబుకు జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ అదించారు.



పురస్కారాన్ని బహూకరిస్తున్న కలెక్టర్

చిరుజల్లులు.. ఆందోళనలో రైతులు

» ధాన్యం రాసులపై పట్టాలు కప్పుతున్నరైతన్నలు

కారేపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో దిత్వా తుఫాన్ వర్షాల హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా వరి పొలాలు కోసిన ధాన్యం కల్లాలో ఉండగా ఇంకా చాలమందికి సంబందించిన పొలాలు కోతలు కోయలేదు.వర్షాలు బారీగా పడితే వరి పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లే పరిస్థితి వస్తుందని రైతులు ఆందోళనలో ఉన్నారు. దీనికితోడు పత్తి పంట తీసేందుకు కూలీలు రాకపోవడంతో పంట చేలోనే ఎండిపోతుందని రైతులు వాపోతున్నారు. బుధవారం మధ్యాహ్నం వర్షం జలులు కురవడంతో వరి ధాన్యం కల్లాలో ఉన్న వరి ధాన్యంపై రైతులు పట్టాలు కప్పుకున్నారు.

సీఎం క్షమాపణ చెప్పాలి: నంబూరి



సత్తుపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సత్తుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడం బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలను వెనక్కు తీసుకుని హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని బీజేపీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. హిందూ సమాజం కళ్లు తెరిచి ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని, భేషరతుగా హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక సీఎం స్థానంలో ఉన్న వ్యక్తి ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని, యావత్ హిందూ సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పకపోతే రాబోయే రోజుల్లో తెలంగాణ సమాజం తగిన బుద్ది చెబుతుందన్నారు. కార్యక్రమంలో నాయుడు రాఘవరావు, పాలా నాగసురేంద్రరెడ్డి, పడిగల మధుసూదన్‌రావు, చీకటి వసంతరావు, మేరుగు శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌లో ఔషధ మొక్కల పెంపకం

ఏన్కూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఔషధ మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. ఈమేరకు బుధవారం 32 రకాల మొక్కలను నాటి, సంరక్షణ చర్యలు చేపట్టారు. గ్రౌండ్ వాటర్ హార్వెస్టింగ్, కిచెన్‌గార్డెన్, కంపోస్టు పిట్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యంగ్ ఎర్త్ లీడర్ ప్రొగ్రాం స్టేట్ కోఆర్డినేటర్ వై.వెంకటరెడ్డి, పాఠశాల హెచ్ఎం వాసవిదేవి, ఉపాధ్యాయులు రాఘవరావు, నరసింహారావు, పుల్లయ్య, శంకరరావు, శ్రీధర్, చంద్రప్రకాష్, హత్తిరాం.. రాంబాబు, కస్తూరి, విజయలక్ష్మిసులోచన పాల్గొన్నారు.



గ్రీన్ రివల్యూషన్ ఆధ్వరర్యంలో ఔషధ మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

పాఠశాలను తనిఖీ చేసిన మండల ప్రత్యేకాధికారి

బోనకల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చొప్పకట్లపాలెం ప్రాథమిక పాఠశాలను బుధవారం మండల ప్రత్యేకాధికారి విజయబాస్కరరెడ్డి, ఎంఈవో దామాల పుల్లయ్యలు తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు పాఠశాలల్లో అమలవుతున్న ఎవరీ చైల్డ్ రీడ్ కార్యక్రమాన్ని వారు పర్యవేక్షించారు. ఆంగ్లంలో విద్యార్థులను పదాలు, వ్యాక్యాలను చదివించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలతో పాటు విద్యార్థుల ప్రగతి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ప్రత్యేకాధికారి విజయబాస్కరరెడ్డి

పుల్లారెడ్డికి షిర్డీ సంస్థాన్ ట్రస్ట్ సన్మానం



సత్తుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పంచాయితీరాజ్ ఛాంబర్ మాజీ డైరెక్టర్ భీమిరెడ్డి పుల్లారెడ్డిని షిర్డీ సంస్థాన్ ట్రస్ట్ ఉప కార్యనిర్వహణ అధికారి భీమ్‌రాజ్ రామారావు దండే బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ విజయవాడ కేంద్రంగా తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, విజయవాడ నుంచి ప్రతిరోజూ సాయినగర్‌కు ట్రైన్ ఏర్పాటు చేయాలని, మన్మాడ్ ట్రైన్‌ను విశాఖపట్నం వరకు పొడిగించాలని విన్నపంలో కోరారు.

ఫలించని బుజ్జగింపులు..

» అధికార పార్టీ అభ్యర్థుల మధ్యే పోటీ

కొణిజర్ల,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఉపసంహరణ రోజు నాటికి కూడ రాజకీయ పార్టీల బుజ్జగింపులు ఫలించలేదు. మండలంలో 27 గ్రామా పంచాయతీలలో అధికస్థానాల్లో కాంగ్రెస్, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఎక్కువగా ఉంది. మండలంలోని పెద్దగోపతి, అమ్మపాలెం, రాజ్యాతండా, లింగగూడెం తదితర గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్ వేశారు. ఎమ్మెల్యే చెంతకు సమస్య వెళ్లినా ఎక్కడా కూడ రాజీ పడలేదు. ఎమ్మెల్యే త్రీవస్థాయిలో తనికెళ్ల, రాజ్యాతండా, పెద్దగోపతి, లింగగూడెం గ్రామాలను ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నించిన్నట్లు సామాచారం. కొన్ని గ్రామాలలో మాత్రం వార్డులకు పొత్తుకుదిరింది. ప్రతి గ్రామంలో ఇద్దరు నుంచి ముగ్గురు సర్పంచ్ పదవికి పోటీలో ఉన్నారు. అమ్మపాలెం గ్రామంలో సర్పంచ్ పదవికోసం ఐదుగురు బరిలో ఉన్నారు.